
ఆంధ్రమహిళ

మహిళాభ్యుదయ మాస పత్రిక



December

1962

డిశంబరు

★

'Andhra Mahila'

Vol. XVIII

No. 12

★

37 nP

ఆంధ్ర మహిళ

ఏకైక మహిళాభ్యుదయ

మాస పత్రిక

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్
వ్యవస్థాపకురాలు

విషయ సూచిక

ముఖచిత్రం

ప్రస్తుతం మనదేశాన్ని పర్యటిస్తున్న జర్మన్ అధ్యక్షుని సతి

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 18 :: డిసెంబరు 1962 :: సంచిక 12

'ధర్మపన్నాలు'

తాడిచెట్టు ఎందుకు ఎక్కావు అంటే దూడగడ్డికోసం, అని జవాబిచ్చాడు అంటూ మన పెద్దలు సామెత చెపుతూంటారు. ప్రస్తుతం చైనావారి ఖబుర్లుకూడా ఇంత విచిత్రంగానూ వున్నాయి. శాంతిమార్గాన పోతున్న భారతదేశంమీద, ఏమరుపాటుగా వున్న మనమీద అమాంతం దురాక్రమణ జరిపారు చైనీయులు ఇటు లడక్ ప్రాంతాల పన్నెండువేల చదరపుమైళ్ళ స్థలాన్ని, అటు నేఫా ప్రాంతాల శీలా పర్వత శ్రేణిని ఆక్రమించుకు అస్సాంవైపు చొచ్చుకువస్తూ అమాత్రం యుద్ధవిరమణ, శాంతి, సంధి షరతులూ అంటూ వ్యర్థ వాగ్దానాలూ ప్రచారాలూ మొదలు పెట్టారు. పై పెచ్చు మేము యాభైతొమ్మిది నవంబరు తొమ్మిదినాటి స్థావరాలకి యిరవై కిలోమీటర్లు వెనక్కి వెళ్ళిపోతాం - అంటూ తమ రాజకీయ చతురిమనంతా చూపెడుతూ, ప్రపంచ ప్రజని, భారతీయులని బోల్తాకొట్టించాలని చూస్తున్నారు.

ప్రస్తుతం చైనా వారి సంధి మాటలు వింటుంటే ఇంతశాంతికాముకులూ, సహృదయులూ అయినవారు అసలు మనపైకి ఎందుకు వచ్చారు? ఆపైన వెనక్కి వెళ్ళి పోతామని, యుద్ధవిరమణ అనీ ధర్మపన్నాలు ఎందుకు చెపుతున్నారు? అనే ప్రశ్న ఇంగితజ్ఞానం వున్న ప్రతివ్యక్తికీ వస్తుంది. 'అడుసు తొక్కనేల ఆ పైన కాలు కడగనేల' ముందు దురాక్రమణ జరపడం దేనికి, ఆ పైన యీ నక్క వినయాలెందుకు? ఇదన్నీ చూస్తుంటే, పక్షిగూడు కిందకూచుని దొంగ జపం చేసే మార్జాలం జ్ఞాపకం వస్తోంది. వీరి యీ పైపై మాటలు విదేశీయులనిగాని, ఆసియా ఆఫ్రికా దేశీయులనిగాని, మననిగానీ, ఏమాత్రం నమ్మించలేవు, నమ్మించవు. ఇన్ని మాటలకి బదులు మన భూభాగం మనకి వొప్పగించి ప్రధాని అన్నట్లు తిరోగమనం అవలంబించ కూడదు! అప్పుడు యీ మాటలకి కొంత విలువ యిస్తాముగా! క్రియారూపం పొందని మాటలు వొట్టి గాలి ఖబుర్లు.

ఈ విషయం మన మిత్రదేశాలకీ, మన ప్రభుత్వానికీ, ప్రజకీ బాగా తెలుసు. అందు కనే రక్షణ సన్నాహాలు చకచకా సాగిపోతున్నాయి. ప్రభుత్వమూ, సైనికులూ అప్రమత్తులై వెనుకటి పొరబాటుచేయకుండా జాగరూకులై వున్నారు. ఇన్నాళ్లూ పాముకు పాలుపోస్తూ వొచ్చాము. అది తన స్వభావం లక్షణంగా కాటు వెయ్య బోతోంది. ఆ కాటునుంచి తప్పించుకోడానికి బలప్రయోగం చేయాల్సిన తరుణ మాసన్న మయింది. దండనతప్ప సర్పానికి మరోభాష అర్థం అవదు. ఈ విష యం గ్రహించే మన ప్రభుత్వము మిత్రదేశాలనుంచి ఆయుధాల సహకారాన్ని కోరాయి. మిత్రదేశాలు మనకి మనస్ఫూర్తిగా త్వరితగతిలో ఆయుధాలనిపంపి - తగుసాయం చేస్తున్నాయి.

మిత్రదేశాల సాయం ఎంతవున్నా మనలో మనకి కొంత బలిమి కావాలి. ఆ బలిమి కలిగినపుడే ఆత్మస్థయిర్యం, శత్రువుని పారద్రోల గలిగే సమర్థతా అలవడు తాయి. దేశం బలంవంతమయినది కావాలి అంటే మనం ఆహార, సాంకేతిక, రక్షణా విషయాలపట్ల ప్రత్యేక శ్రద్ధచూపాలి. దేశంలోని ప్రతివ్యక్తీ దేశరక్షణార్థం యితోధిక సాయం చేస్తూ, దేశపురోభివృద్ధికి తన కర్తవ్య నిర్వహణలో మనస్ఫూ ర్తిగా పాటు బడాలి.

పురుషునిలో ఆత్మగౌరవం, విశ్వాసం, ధైర్య స్థయిర్యాలు కలిగించే బాధ్యత పూర్తిగా స్త్రీలమీద వున్నది. ఒక పురుషుడు వున్నతుడవడానికి పతనమవడానికి స్త్రీయే కారణం. అలాగే మామూలు వ్యక్తి మూఢుడైనా, పిరికిపంద అయినా అందుకు కారణం స్త్రీయే. సృష్ట్యాదినుంచీ స్త్రీ పురుషుని యోధునిగా శూరునిగా చేసి, విజయలక్ష్మిని కొని తెమ్మని పంపుతోంది. చరిత్రపుటలు తిరగేస్తే - జిజియాబాయ్ ఝాన్సీలక్ష్మిబాయ్, చానమాంబ, మాంచాల యిలా ఎందరో వనితాశిరోమణులు తమ పుత్రులని, భర్తలని సమరయోధులని చేసి, విజయలక్ష్మికి అర్పించారు.

ఈనాడు తిరిగి ఆ అవసరం కలిగింది. ఇంటింటా మాంచాలలూ, జిజియా బాయ్‌లూ అవతరించవలసిన శుభసమయ మాసన్న మయింది. స్త్రీలు దేశరక్షణకై యితోధికంగా, ధన, కనక, వస్తువాహనాలు త్యాగము చెయ్యవలసిన తరుణ మేర్పడింది. ఈ అత్యవసర సమయంలో స్త్రీలు లోభత్వాన్ని, భీరుత్వాన్ని వదలి తమకి చేతనయిన దానంచేసి - భారతదేశ విజయానికి చేయూతనివ్వాలి. మనస్ఫూర్తిగా యిచ్చినది తులశిదళమైనా సరే అత్యంత విలువైనదిగా మారుతుంది. స్త్రీలు తాముయిచ్చే విరాళాలని ఏరూపంలో నైనాసరే మనస్ఫూ ర్తిగా, నిండుహృదయంతో యివ్వండి. అసంతృప్తితో తప్పదురా అన్నట్లుగాక మనస్ఫూర్తిగా యివ్వండి. అప్పుడే విజయలక్ష్మి మనయింట్లోకి ఆత్మబంధువై వస్తుంది.

మాలతీ చందూర్

గౌరవ సంపాదకులు

కీ. శే. కార్వే పండితుడు

‘చిరంజీవ శతాయుష్ష’ అని మన పెద్దలు ఆశీర్వదిస్తూంటారు. కొందరి విషయంలో ఈ ఆశీర్వచనం నిజమవుతుంది. కార్వేపండితుడు పెద్దల ఆశీర్వచన ప్రకారం నూరేళ్లపైన బ్రతికి ఈ నవంబరు నెలలో చనిపోయారు.

ఆంధ్రదేశానికి ఆంధ్ర స్త్రీజాతికి వీరేశలింగం ఎంతముఖ్యుడో ఎంతటి అమూల్య సేవచేశారో మహారాష్ట్రానికి, మరాటీ వనితలకి కార్వే అంతటి సేవ చేశారు. ఈయన తన ఆశయాలకోసం నిరంతర పోరాటం జరిపి, ఆచరణలోకూడా పెట్టారు. వితంతు వివాహం వితంతువుల విద్య మొదలగు వాటికై నిరంతర పోరాటం జరపడమేగాక, ఈయన ద్వితీయ కళత్రంగా వితంతువుని చేపట్టారు. అనేక విద్యాలయాలకి, వితంతు శరణాలయాలకి, పూనాలోని కార్వే విశ్వవిద్యాలయానికీ యీయన వ్యవస్థాపకుడు. పంధొమ్మిది, యిరవై శతాబ్దాలలోని స్త్రీల ప్రగతికై పోరాడిన యుగపురుషులలో కార్వే ఒకరు. వారిమరణంతో భారతమాత ఒకరత్నాన్ని కోల్పోయింది. స్త్రీజాతి ఒక ఆత్మబంధువుని పోగొట్టుకున్నది.

ఎలినార్ రూజ్‌వెల్ట్

మానవ హక్కుల ప్రణాళికా నిర్మాత. ప్రపంచ స్త్రీజనాభ్యుదయ సహకారి, అమెరికా దేశపు ముఫై రెండవ ప్రసిడెంట్ రూజ్‌వెల్ట్ సతీమణి, భారత ప్రజలకి ప్రియబాంధవి, వెనకబడ్డ దేశాలకి ఆత్మీయురాలు అయిన ఎలినార్ రూజ్‌వెల్ట్ నవంబరు నెల తమ స్వగృహంలో మరణించారు.

78 ఏళ్లు వయసువచ్చినా మొన్న మొన్నటిదాకా యీమె అనేకమైన ప్రజోపకరకార్యాలు చేసింది. వెనుకబడ్డ దేశాల ప్రజలకొరకై యీమె తన జీవితకాలంలో అసమానమైన సేవచేసింది. అమెరికన్ ప్రసిడెంటు భార్యగా, ఐక్యరాజ్యసమితికి అమెరికన్ ప్రతినిధిగా యీమె మానవాళికి చేసిన సేవ అమూల్యం. లోగడ యీమె మనదేశానికి సౌహార్ద్ర పర్యటనలో రెండుసార్లు వచ్చారు. రూజ్‌వెల్ట్‌సతి భారతజాతికి ప్రియమిత్రురాలు. ప్రపంచ మహిళలో ఒక ధృవతార రాలిపోయింది.

సమీక్ష

మదన కామరాజు కథ

శ్రీవిఠలాచార్య నిర్మించిన ‘మదన కామరాజుకథ’ చిత్రం బహుళ జనాదరణ పొందుతుందనటంలో సంశయం లేదు. చిరపరిచితమైన యీజానపద గాథను చక్కటి సాంకేతిక హంగులతో, మంచినటీనట వర్గంతో, ప్రేక్షక జనరంజకంగా నిర్మించాడు శ్రీవిఠలాచార్య.

ఇందులో యిద్దరియువకుల మధ్య గాఢమైత్రీ, తల వెంట్రుక చూసి శిల్పాన్నంతా చెక్కిన శిల్పిప్రజ్ఞ, గురుపుత్రిని మోహావేశంతో బంధించిన కామాంధునికి గురుశాపం, మదన కామరాజు మొదటి భార్యలో కలిగే జెలసీ, గురు పుత్రికను నిర్బంధించటం వలన యువరాజు అయినా సరే శిరచ్ఛేదన శిక్షగా పొందే న్యాయపాలనా, ప్రణయరంజనీ రాకుమార్తె యువకరాజకుమారులని వోడించి బంధించడం, శిలాప్రతిమని మోహించి మూర్ఛపోయిన మదనకామరాజు ప్రేమ తీవ్రత, మిత్రుని అభీష్టంకొరకై రత్నావళిని కొనివచ్చి, కత్తికి బాసిగం కట్టి పరిణయమాడి. ఆ అందాలరాసిని మిత్రునికి భార్యగా అర్పించడం యిత్యాది చిత్ర విచిత్రాలతో, ప్రేక్షకులలో వుత్సకతనీ. ఆనందాన్ని కలిగించేటువంటి చక్కటి చిత్రం నిర్మించారు, విఠల్ ప్రొడక్షన్సు వారు.

ఈ చిత్రంలో అనురాధ, రాజశ్రీ, జయంతీ, హరనాథ్, కాంతారావు రాజనాల మున్నగువారు తమ తమ పాత్రలను చక్కగా నటించారు. ఒకటి రెండు పాటలలోని సాహిత్యం వుత్తమ స్థాయిలోవున్నది. పి. బి. శ్రీనివాస్, సుశీల పాడిన (నీలిమేఘాలలో) పాట ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంటుంది.

ప్రజాబహుళ్యాన్ని అమితంగా ఆకర్షించే చిత్రాలని విరివిగా నిర్మించే విఠలాచార్య, ఈ మదనకామరాజు చిత్రంతో తమ ప్రత్యేక ప్రతిభని మరోసారి నిరూపించుకున్నారు!.

- నిర్మల

మా కార్యవర్గ సమావేశము

ఆంధ్రమహిళాసభ కార్యనిర్వాహకవర్గసమావేశమూ, రజతోత్సవ కమిటీ ఖర్చుల నివేదిక సమర్పణా నవంబరు 21 వ తేదీన అడయార్‌లోని ఆంధ్రమహిళా సభ జుబిలీ హాలులో జరిగినవి. ఈ రెండు సమావేశాలకీ వ్యవస్థాపకురాలు శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్ అధ్యక్షత వహించారు.

ఆంధ్రమహిళా సభ కార్యనిర్వాహక వర్గ సమావేశానికి కమిటీ మెంబర్లూ, సహాయకార్యదర్శినులూ మొదలైనవారు హాజరయారు. సంస్థలోని ఆయా శాఖలలో జరుగుతున్న కార్యక్రమాలూ, జమాఖర్చులూ, విద్యార్థినుల సంఖ్యా వివరాలూ సహాయ కారదర్శినులు నివేదించారు.

ఆ సందర్భంలో శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్ వివిధ శాఖలలో జరుగుతున్న కార్యక్రమాలని సింహావలోకనం చేశారు. సంస్థ నిర్మిస్తున్న నూతన భవనాల విషయం ముచ్చటించారు. అడయార్‌లోని ఆంధ్రమహిళా సభ నర్సింగ్ హోమ్ నర్సుల హాస్టలు నిర్మాణం చాలా మటుకు పూర్తిఅయినట్లే. సుమారు నూటయాభై మంది విద్యార్థినులు వుండటానికి అనువగు సువిశాలమైన భవంతియిది. త్వరలోనే యీ హాస్టలు భవన గృహప్రవేశం జరుగనున్నది.

ఆంధ్రమహిళా సభ హైద్రాబాద్ శాఖ తమ స్వంత భవనాలని నిర్మించుకుంటున్నది. ఈ భవన నిర్మాణం ఏప్రిల్ మే నెలల్లో పూర్తిఅవుతుంది. హైద్రాబాద్ శాఖలో చేతిపనుల పరిశ్రమయందు తర్ఫీదుపొందుతున్న వివిధ ప్రాంత్రాల విద్యార్థినులూ, ఎనిమిదవ తరగతికీ స్కూలుఫైనల్ పరీక్షకూ వెళ్తున్న విద్యార్థినులూ వీరిలో వసతి కావలసినవారి కొరకై హాస్టల్ నిర్మాణం జరుగుతున్నది. వుస్మానియా యూనివర్సిటీకి దగ్గిరవున్న విద్యానగరంలో మహిళా సభ భవనాలు చకచక నిర్మితమవుతున్నాయి. వీటికొరకై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము లక్ష రూపాయల ద్రవ్యమూ, భవన నిర్మాణ స్థలమూ విరాళంగా యిచ్చారు. ఇవిగాక హైద్రాబాద్ ప్రజలు యాభైవేలు విరాళమిచ్చారు. ఈ భవన నిర్మాణం మే నెలలో పూర్తిఅయి, హైద్రాబాదులోని ఆంధ్రమహిళా సభ తన స్వంత భవనంలో గృహప్రవేశోత్సవం జరుపుకోబోతున్నది.

నూతన భవన నిర్మాణాల విషయం చెబుతూ శ్రీమతి దేశముఖ్ ఆంధ్రమహిళా సభ మద్రాసు, హైద్రాబాద్‌లలో గల వివిధ శాఖల విద్యార్థినుల సంఖ్యా వివరాలు తెలిపారు. నర్సింగ్ హోమ్‌లో శిక్షణపొందుతున్న సంక్షిప్తనర్సులు, కుటుంబ నియంత్రణ విద్యార్థినులు, ఆర్థోపెడిక్ సెంటర్‌లోని వికలాంగులైన బాలబాలికలు, మహిళా విద్యాలయంలోని విద్యార్థినులు, హాస్టల్‌లోని విద్యార్థినులు, వర్కింగ్ గరల్సూ, చేనేత, ముద్రణాలయంలోని విద్యార్థినులు, మిషను కత్తిరింపులు నేర్చుకుంటున్నవారు, ఎలిమెంటరీ స్కూలు, కిండర్ గార్డెన్ స్కూలు, వీటన్నిటిలోని మొత్తం విద్యార్థినులు కానీయండి, శిక్షణ పొందుతున్నవారు కానీయండి, వీరందరి సంఖ్య సుమారు ఎనిమిది వందలదాకావుంది. ఇదేమాదిరి హైద్రాబాద్ శాఖలోని విద్యార్థినులూ, శిక్షణ పొందేవారి సంఖ్యాకలిపి రెండువందలదాకా వుంది. మొత్తం యీ రెండుచోట్లా కలిపి ఒక వెయ్యిమంది దాకా వున్నారు.

ఆర్థోపెడిక్ సెంటర్‌లో వికలాంగులైన బాలబాలికలకు, ప్రత్యేకచికిత్సావసతులే గాక, విద్యకూడా గరుపుతున్నారు. వీరికొరకై హాస్టలు నిర్మాణం జరుగబోతున్నది. ఈ పిల్లలకొరకై ప్రత్యేకం టీచర్లున్నారు. ఈ సెంటర్ గురించి విదేశాలనుంచి కూడా వాకబు చేస్తున్నారు. ఈ విషయాలన్నీ శ్రీమతి దుర్గాబాయ్ కార్యనిర్వాహక సభ్యులకి విన్నవించారు. హైద్రాబాద్ శాఖలో రాబోయే సంవత్సరంలో హయ్యర్ సెకండరీ గ్రేడు ట్రయినింగు స్కూళ్లను తెరిచే పథకం ఆలోచనలో వున్నదనికూడా తెలిపారు. అటు తరువాత రజతోత్సవ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కార్యనిర్వాహక వర్గమూ, సహాయ కార్యదర్శినులూ, ట్రస్టుబోర్డు సభ్యులూ వీరేకాక రజతోత్సవ సంఘ అధ్యక్షురాలు మీర్జాపూర్ రాణీ, మిసెస్ ఖలీల్, ట్రెజరర్ శ్రీ సి. సత్యనారాయణ శ్రీమతి కందామాణిక్యాంబ మున్నగువారు హాజరయ్యారు.

శ్రీసత్యనారాయణ గారు జుబ్లీ రిపోర్టు చదివారు. ఈ సిల్వర్‌జుబ్లీ సభలు, విపరీత ఆడంబరంతో అధిక ధనవ్యయంతో గాక, పొదుపుగా చక్కగా జరిగినవి. వసూలయిన దానికంటే ఎక్కువ ఖర్చుపెట్టక, ట్రెజరర్ అతినేర్పుగా, జాగ్రత్తగా నిర్వహించారు. సాధారణంగా యిటువంటి వుత్సవాల సందర్భంలో జమకంటే ఖర్చు రెట్టింపు వుంటుంది. అట్లుకాక శ్రీసత్యనారాయణగారు ప్రతి పైసా అతిజాగ్రత్తగా ఖర్చుచేశారు. ఈ విషయం సభికులందరికి హర్షామోదం కలిగించింది. రజతోత్సవానికని సువిశాలమైన పెండాల్‌ని వుచితంగా నిర్మించియిచ్చిన గాన్ అండ్ డంకర్లీ వారికీ, రజతోత్సవ విందుకగు ఖర్చులని భరించిన ట్రెజరర్ శ్రీ సి. సత్యనారాయణగారికి, సుమారు మూడువేల రూపాయల విలువచేసే ఆహార ధాన్యాలని విరాళంగా యిచ్చిన మద్రాసులోని కిరాణా వర్తకులకీ కృతజ్ఞత తెలిపారు వ్యవస్థాపకురాలు. రజతోత్సవాలకి పైచెప్పిన విరాళాలేగాక, సభ్యురాండ్రనుంచీ, శ్రేయోభిలాషులనుంచీ సుమారు యాభైఅయిదువేల రూపాయల నగదు వసూలయింది. వీరందరికీకూడా తమ కృతజ్ఞత తెలిపారు శ్రీమతి దుర్గాబాయ్‌గారు. ధనరూపంలో, వస్తురూపంలో, శ్రమరూపంలో రజతోత్సవాలకి యితోధికమైన సేవ చేసినవారికి శ్రీమతి దుర్గాబాయ్‌గారు ప్రత్యేకంగా కృతజ్ఞత తెలుపుతూ సభికురాండ్రు, కార్యదర్శినులు, కార్యనిర్వాహక వర్గ సభ్యులు అంతా ఐకమత్యంతో మెలుగుతూ సంస్థని తమదిగా భావించుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

వినోదిని

శ్రీమతి కాకుమాను భారతి

ఆ రాత్రి వినోదినికి నిద్రపట్టిందికాదు!
మనస్సంతా ఏదో కలతగావుంది....!
తలచిన కొలది ఆవేదన...!
గుండెల్లో ఏదో బరువు....!

"క్షమించు వినోదిని! నువ్వు నా చనువుని అపార్థం చేసుకున్నావ్! అంతేకాని నేను నిన్నెన్నడూ ప్రేమించ లేదు! ఒకవిధంగా యీ అభిప్రాయాన్ని నేను నీకిచ్చినందు కెంతో చింతిస్తున్నాను.. " అన్న 'మధు' మాటలు 'శూలాల్లా' ఆమె హృదయాన్ని అనుక్షణం బాధి స్తున్నాయి! మరచిపోదామని ఎంత విశ్వప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోతూంది!

'మధు' నోటినుంచి అటువంటి సమాధానం వస్తుం దని ఆశించని వినోదినికి అది 'పిడుగుపాటు' లా పని చేసి కుప్పగాకూల్చింది! ఏదో అవ్యక్తశక్తి; సుందరంగా వూహించుకున్న ఆమె ఆశాసౌధాన్ని కూల్చి ముక్కలు ముక్కలు చేసివైచింది.

ఆమె మధుని గాఢంగా ప్రేమించింది! మధుకూడ తనని.... ప్రేమిస్తున్నట్లు విశ్వసించింది. ఎన్నోన్నో కలలుకన్నది. ఈనాడు అవి వ్యథలై ఆమెకి రెట్టింపు బాధను కల్గిస్తున్నాయి!

మధు **అప్పుడప్పుడనే**వాడు;

..."భాగస్వామిని **ఎన్ను**కోవడమంటే నా ఉద్దే శంలో.... మన భవిష్యత్తుని మనం నిర్ణయించుకుంటున్నా మన్నమాట....! ఈప్రయత్నంలో మనకు సరైన వ్యక్తి తటస్థపడకపోతే ఉజ్వలము, సుందరము అని మురిసిన మన భవిష్యత్తు తలక్రిందులై జీవితాంతం నరకయాతన అనుభవించాల్సివస్తుంది! అటువంటప్పుడు ఎవరో ముక్కు మొహం ఎరగని అమ్మాయిని భాగస్వామినిగా చేసు కోటానికి నేనంగీకరించను! ఎవరి హృదయ సౌందర్యా నికి మనం ముగ్ధులవుతామో ... ఎవరి ఆశయాలు ... అభిరుచులు మనకు ఇష్టాన్ని కల్గిస్తాయో వార్ని నేను జీవితభాగస్వామిగా స్వీకరిస్తాను..... " అని!

మధు అన్నమాటలు వినోదినికి చాలా సంతోషాన్ని కల్గించాయి ఆనాడు అవ్యక్తానందంతో పొంగిపోయింది.

మధు ఉద్దేశంలో 'తనే' నని మురిసిపోయింది!
అతని దృష్టిలో.... తనే!

మధు దృష్టిలో 'తను' కాదు మరొకరు!
అది తెలిసి గుండెలవిసేలా ఏడ్చింది!

ఆమె బ్రతుకులో 'ఆనందం' వొలికి పోయింది! ఆవేదనమిగిలింది....! ఆమె జీవితంలో 'వెలుగు' కరువయిపోయింది. 'కటిక చీకటి' మిగిలింది! బయట చీకట్లు దట్టంగా వ్యాపించాయి. ఆ చీకట్లు పగటి వెలుతు రుకి దూరంగా పారిపోతవి! మరి వినోదిని హృదయంలో అలముకొన్న చీకట్లు ...?

* * *

చీరెలు కొనుక్కొని మెట్లుదిగుతున్న వినోదిని ఎదురుగా వస్తున్న మధుని చూచేసరికి 'విద్యుత్ఘాతం' తిన్నదానివలె చలించిపోయింది మధుని **చూడనట్లు** ఆమె **తలవంచుకుని** మెట్లుదిగింది!

మధు ఆమె ముందుకువచ్చి "బాగున్నావా వినోదినీ!" అంటూ ఎంతో ఆప్యాయంగా పల్కరించాడు.

వినోదిని జవాబివ్వలేదు. క్షణకాలం మధు కళ్లలోకి తీక్షణంగా చూచింది. తిరిగి నడకవేగం హెచ్చించింది.
పోతున్న 'టాక్సి' ని పిల్చి ఆపింది
అందులోకి ఎక్కికూర్చుంది.

మధుకి ఆమె జవాబివ్వక పోవటం బాధకల్గించింది చిన్నబుచ్చుకున్నాడు! ...

వెంటనే ఏదో గుర్తుకివచ్చినట్లు "వినోదినీ.... వొక్క మాట. రేపు నువ్వు మాఇంటికి రావాలి. నీతో కొన్ని విషయాలు .. మాట్లాడాలి. తప్పకవస్తావుకదూ!" అంటూ తనఅడ్రసు కాగితాన్ని టాక్సీలోకి విసిరాడు.

పెద్దరొదచేసుకుంటూ టాక్సీ వెళ్ళిపోయింది.

కార్లోవెళ్తున్న వినోదిని మనస్సులో అనేకమైన ఆలోచనలు దొర్లాయి.

మధు తన్నెందుకు రమ్మన్నట్లు?

ఏమిటి తనతో మాట్లాడేది?

ఏమైనాసరే తనువెళ్ళదు. వెళ్ళినందువల్ల ప్రయోజనం లేకపోగా పరితాపం ఎక్కువవుతుంది! మానిందనుకుం టున్న గాయం తిరిగి పెద్దదవుతుంది. ఆ బాధకు తను తట్టుకోలేదు. సాధ్యమైతే మధుని మర్చిపోగలిగిన

పక్షంలో తను ధన్యురాలు! ఒక్కసారి కారు బ్రేకుతో ఆమె ఆలోచనలు చెల్లాచెదరై పోయాయి,

*　　*　　*

ఒకరోజు మధు అకస్మాత్తుగా చైనీస్‌గార్డన్స్‌లో కనుపించాడు. వినోదినికి వేగంగా గుండెలు కొట్టుకోసాగాయి.

ఈసారి మధుప్రక్కన అతనిభార్య మూడేండ్లపిల్లవాడు కూడ కన్పించారు

వారు తనవైపే రావటంచూచి వినోదిని కంగారుగా లేచి నిలబడింది.

మధు వినోదినిని తన స్నేహితరాలుగా భార్యకు పరిచయం చేశాడు.

పరిచయమైన తొలిక్షణమే మధుభార్య వినోదినిని ఆకర్షించింది. ఆమెపేరు మంజులత! సన్నగా అందంగా వుంది. వినోదినితో ఎంతోకాలంనుంచి ఎరిగివున్నట్లు మాట్లాడింది!

ఇంతలో బాబు ఏడవటం ఆరంభించాడు! వాడ్ని ఆపటం మంజులతవల్ల కాలేదు! సముదాయించటం కష్టతరమైపోయింది.

"క్షమించండి బాబు ఏడుస్తున్నాడు వాడ్నలా జూ వద్దకు తీసుకెళ్ళి... అవన్ని చూపించుకొని తీసుక వస్తాను. అప్పటికైనా యీ వెధవ మానాడోలేదో....! మీరిక్కడే వుండండి నేనిపుడే వస్తాను" అని మంజులత భర్తతోను చెప్పి బాబును తీసుకుని వెళ్ళిపోయింది.

చివరకు మధు వినోదిని మిగిలారు...

వినోదిని మధు సామీప్యంనుంచి దూరమవ్వాలనుకుంది గాని... ఏదో విచిత్రశక్తిఆమెనక్కడ్నుంచి కదలనివ్వలేదు,

"ఆరోజు నువ్వు వస్తావని యెదురు చూశాం! కాని నువ్వురాలేదు!" మధు ఆమెకు దగ్గర్లో చతికిలబడుతూ అన్నాడు!

వినోదినేం మాట్లాడలేదు... గంభీరంగావుంది.

తిరిగి మధు అన్నాడు.

"ఏం వినోదిని పెళ్ళిచేసుకోవటం ఇష్టంలేదానీకు? ఇలా అవివాహితగానే వుండిపోదల్చుకున్నావా?..."

మధు అన్నమాటలు వినోదినిలో సంచలనాన్ని కల్గించాయి! అప్పటివరకు ఆమె కోపాన్ని.... దుఃఖాన్ని తనలోనే బలవంతాన అణచుకుంది. ఇక అసాధ్యం అనిపించింది. ఒక్కసారి అగ్నిపర్వతం బ్రద్దలైనట్లైంది! ఇక యీజీవితానికి ఆ ప్రయత్నం తలపెట్ట దల్చుకోలేదు...."

"కారణం?"

"స్త్రీ తనజీవితంలో ఒక్కరికే మనసివ్వగలదు. అవొక్కర్నే ప్రేమించగలదు."

"అతడు వివాహితుడని తెలిసికూడ అతన్నిగురించి ఆలోచించటం అవివేకమే అవుతుంది"

"మధూ...!"

"అవును వినోదిని. నావల్ల మరొకరికి అన్యాయం జరగటం నేను సహించలేనివిషయం! అయితే ఇదిచాలా ఆలస్యంగా నేను తెలుసుకోవటం జరిగింది. అప్పటికి నిన్ను కలవాలని నీతో కొన్నివిషయాలు మాట్లాడాలని ప్రయత్నించాను. కాని ఇప్పటివరకు.... నాకా అవకాశం లభించనేలేదు!..." అని మధు కొంచెంసేపాగి తిరిగి ప్రారంభించాడు"

వినోదిని అతికష్టంగానే వింటోంది.

"జీవితంలో ఏవోకొన్ని ఆశించి అవి ఫలించనంత మాత్రాన శేష జీవితాన్ని నిరాశానిస్పృహలతో కాలం గడిపేవారంటే నాకు చాలా అసహ్యం వేస్తుంది. ఆశించినదానికి భిన్నంగా ఆశాసౌధాలు కూలినంతమాత్రాన్ని భవిష్యజ్జీవితాన్నెందుకు కన్నీటికి కలతలకు అంకితం చేసుకోవాలి? దుఃఖించి ప్రయోజనంఏమిటి? సాధ్యమయితే ఎండమావుల్లోనే సుందర సరోవరాన్ని సృష్టించుకోవటానికి ప్రయత్నంచెయ్యాలి. ఆకులురాలిపోయినంతమాత్రాన తిరిగి చెట్టు చిగురించదా?"

"చెప్పటం సులభమే కాని ఆచరణలో పెట్టటమే కష్టమైనపని"

"అలా ఎన్నటికీకాదు"

"అయితే ప్రాణంకన్న అధికంగా ప్రేమించే నీభార్య చనిపోయిందనుకో! అపుడు నువ్వు ప్రయత్నించి నీ జీవితాన్ని ఆనందమయం చేసుకోగలవా?"

"వినోదినీ!" .. మధు పిచ్చిగా ఆక్రోశించాడు

"అంతే వస్తాను ..." చరుున అక్కడ్నుంచి లేచి వెళ్ళింది వినోదిని.

బాబుకి 'జూ' చూపించి తీసుకొచ్చిన మంజులత .. అక్కడ వినోదిని లేకపోవటమూ మధుకళ్ళల్లోని నీళ్ళు

చూచి.... చకితురాలైంది....

* * *

హఠాత్తుగా ఒకరోజు వినోదిని అన్నయ్య భాస్కరం వినోదిని గదిలోకి వచ్చాడు.

"ఏం వినోదినీ. ఈ మధ్య గది విడచి ఎక్కడకీ పోవటం లేదేం? శరీరకంగానూ, మానసికంగాను, నీలోఎంతో మార్పువచ్చిందమ్మా. నిత్యం నీలో నువ్వు ఏదో ఆలోచిస్తుంటావ్! కారణం నాతో చెప్పకూడదా తల్లీ" అంటూ! భాస్కరం ఎంతో అనునయంగా పల్కాడు. "వాంట్లో ఏం బావుండటం లేదన్నయ్యా అంతకు తప్ప మరేంలేదు" భాస్కరానికి అది అబద్ధంగానే తోచింది అందుకే అన్నాడు.

"లేదమ్మా నువ్వేదో దాస్తున్నావ్! సమయం వచ్చినపుడు నువ్వేచెప్తావు." అని చెప్పి పోబోతూ ఏదో గుర్తుకు వచ్చినట్లే. "వినోదినీ! ఈ రోజు ఇంటివద్ద నుంచి ఉత్తరం వచ్చింది నాన్నగారి ఆరోగ్యం బాగ క్షీణించి పోయిందట ... నీపెళ్ళిగురించే ఆయన దిగులు, విచారమూ. నిన్నొక ఇంటి దాన్ని చేసిచూడాలని ఎంతో వుబలాట పడుతున్నారమ్మా!" అన్నాడు.

"అది యీజన్మకు అసాధ్యం అన్నయ్యా."

భాస్కరం చెల్లెలి సమాధానం విని గతుక్కుమన్నాడు.

చివరకు బుజ్జగిస్తున్న ధోరణిలో. "అదికాదమ్మా. వారికీ వృద్ధాప్యంలో ఏవో కోర్కెలుంటాయి వాటిని తీర్చటం మన ధర్మం తల్లీ!" అన్నాడు.

"నన్నీ విషయంలో బలవంత పెట్టకన్నయ్యా!" మొండిగా జవాబిచ్చింది వినోదిని. భాస్కరం మౌనంగా గది బయటకు నడిచాడు.

* * *

అన్నయ్యతో ఏదో మాట్లాడాలని వెళ్ళబోతున్న వినోదినికి గదిలో అన్నయ్యతో మాట్లాడుతున్న మధును చూచేసరికి ముచ్చెమటలు పోశాయి. ఠక్కున అక్కడే నిలబడిపోయింది.

అన్నయ్యతో మధుకు పరిచయం వున్నదన్న సంగతి అప్పటి వరకు ఆమెకు తెలియదు.

మధు పొయ్యేవరకు బయటనేవుండి, ఆ తర్వాత గదిలోనికి వెళ్ళింది! వినోదినిరాక భాస్కరాన్ని విస్మితుడ్ని చేసింది.

చెల్లెలికేసి ఆశ్చర్యంగా చూస్తూ. "ఏమమ్మా! ఈరోజిలా వచ్చావ్.?" అంటూ ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

వినోదిని దానికి జవాబివ్వకుండ. "ఇప్పుడు నీతో మాట్లాడి వెళ్తున్న దెవరన్నయ్యా?" అని ప్రశ్నించింది తనకేమీ తెలియనట్లు.

"ఓ. అతనా! అతను మా ఆఫీసులోనే పని చేస్తుంటాడు చాలమంచివాడు." అని కాసేపాగి "అయితేఏం. భగవంతుడు పాపం అతనికి చాలఅన్యాయం చేశాడమ్మా!" అన్నాడు భాస్కరం.

భాస్కరం మాటలకు వినోదిని కొంచెంజంకింది! "ఏం జరిగిందన్నయ్యా?" అంటూ ఆతృతగా ప్రశ్నించింది.

"ఈ మధ్యనే అతని భార్య చనిపోయిందమ్మా!"

వినోదిని అదిరి పోయింది అదివిని.

నోటమాటలేదు.!

నెత్తిమీద ఎవరో బలంగా సమ్మెటపోట్లు బాదినట్లయింది! గుండెల్ని ఎవరో నిర్దయగా కోసివేస్తున్నట్లు అనుభూతి పొందింది తనని రెండుగా చీల్చివేసినట్లు.... బాధపడసాగింది,!

"అయినా అటువంటి వ్యక్తులు మనకంటికి విచిత్రంగాను... చాల అరుదుగాను కన్పిస్తుంటారు! ఎంతటి విపత్కర పరిస్థితిల్లోను, అతను చింతించే వ్యక్తిగాడు, అనంత దుఃఖంలోనే ఆనందాన్ని సృష్టించుకుంటూ సంతోషంగా జీవనయాత్ర సాగిస్తున్నాడు. మును పెలా భార్యకు పూలు చీరెలు కొని ఇంటికి తీసుకొనివెళ్లేవాడో. అదే విధంగా యీనాడు తీసుకెళ్తుంటాడు! అతనిలో అప్పటికి, ఇప్పటికి ఎటువంటి మార్పులేదు" అని చెప్పి భాస్కరం ముగించాడు!

* * *


వినోదినికి తన హృదయం ఎవరోకెలికి నట్లయింది ... పశ్చాత్తాపంతో ఆమె హృదయం దగ్ధమై పోయింది "సాధ్యమయితే ఎండమావుల్లోనే సుందర సరోవరాన్ని సృష్టించు కోవటానికి ప్రయత్నించు!" అన్న మధు మాటలు... ఆమెకు పదేపదే గుర్తుకు రాసాగాయి.

వినోదిని వెక్కి వెక్కి ఏడ్చింది. గట్లు త్రెంచుకున్న ప్రవాహంలా కన్నీరు ఆమె చెక్కిళ్ళ మీదుగా కారిపోతున్నది. 'కారుచీకట్లలో కాంతిపుంజాన్ని' వెదకి చూపించిన మధు కాళ్ళను, తన కన్నీటితో కడగాలనిపించింది ..తనను క్షమించమని వేడుకుందామనుకుంది పరుగున వీధిలోకి వచ్చింది!

మల్లెపూలు పొట్లం కట్టించుకొని బయలుదేరిన 'మధు' అప్పటికే, వీధిమలుపు తిరిగాడు....!....!....!

* * *

ఆతర్వాత కొద్దిరోజుల్లోనే వినోదినికి వివాహం జరిగింది! పెళ్ళికొడుకు మాత్రం 'మధు'కాడు!....!....!



సాహిత్య విలువలు

శ్రీమతి ఎం. వేదవల్లి తాయారమ్మ

ఆంధ్రమహిళా సభ రజతోత్సవ సందర్భాన రచయిత్రుల సమ్మేళనం జరిగినది. రెండురోజులపాటు జరిగిన సమావేశంలో సుమారు యిరవై మందిదాకా సోదరీమణులు పాల్గొన్నారు. ఆ సమ్మేళన సందర్భంలో తొలిరోజున "సాహిత్యమూ-సాంస్కృతిక విలువలూ" అన్న శీర్షికకింద చదివిన వ్యాసాలు సంగ్రహంగా "ఆంధ్ర మహిళ"లో ప్రచురించాము. రెండవరోజున "సాహిత్యమూ-సాంస్కృతిక ప్రమాణాలూ" అన్న శీర్షికకింద చదివిన వ్యాసాలలో కొన్నిటిని పోయిన నెలప్రచురించాము. ఈ నెల మిగతా వ్యాసాలన్నీ ప్రచురిస్తున్నాము.

ఈసంచికతో రజతోత్సవ సందార్భాన చదివిన సాంస్కృతిక సమ్మేళన వ్యాసాలు ముగిసినవి. ఈసందర్భంలో తమ తమ వ్యాసాలని చదివి, రజతోత్సవాలని జయప్రదం చేయడమేగాక – తద్ వ్యాసాలని మా ఆంధ్రమహిళలో ప్రచురించడానికి అనుమతించిన సోదరీమణులకి కృతజ్ఞత తెలుపు కుంటున్నాము.

ప్రాచీన మహాకవులు సాహిత్యానికి అమూల్యమైన విలువనిచ్చారు. "విశ్వశ్రేయఃకావ్యమ్" అని వాగనుశాసనుడైన నన్నయభట్టారకుడు అనుశాసించాడు. అదిదోషరహితమై గుణభూషితమైనదిగా నుండి వాక్కుచేత, అర్ధముచేత అలంకరింపబడినదై యుండవలెనని నిర్వచించాడు. అటువంటి కావ్య సృష్టికి అవతారమూర్తులు లోకోత్తర పురుషులునైన ధీరోదాత్త నాయకులను సృష్టించి కధావస్తువును కల్పించి కావ్య రచన కుపక్రమించారు మహాకవులు.

"వాగర్ధా వివసంపృక్తౌ వాగర్ధప్రతిపత్తయే।
జగతః పితరౌ వందేపార్వతీపరమేశ్వరౌ॥

అని కాళిదాస మహాకవి తన రఘువంశ మహాకావ్యాదిని కావ్యవస్తువు జగత్పితలగు పార్వతీపరమేశ్వరుల వలె అవినాభావసంబంధం గలిగి అమరత్వాన్ని గణించాలని ప్రార్ధనాపూర్వకంగా నిర్వచించాడు. వాక్కునకు అర్ధానికి గల సంబంధము అతి సన్నిహితము అతి నిశితమూను. మంచి కవితకు భావనాపటిమ అత్యంతావశ్యకం. ఏ విషయాన్నైనా భావనచేయనిదే రచన ప్రారంభంకాదు.

అరణ్యంలో బోయవాడు క్రౌంచమిధునంలోని ఒక పక్షిని కొట్టగా రెండవపక్షి చేస్తున్న ఆర్తనాదంవిని దయార్ద్ర హృదయంతో "మానిషాధ ప్రతిష్ఠాంత్వమగమత్ శాశ్వతీస్సమాః। యత్క్రౌంచమిధునాదేక మవధీః కామమోహితమ్" అని ఆదికవి వాల్మీకి పలికిన కరుణారసపూరిత వాక్యాలు ఛందోబద్ధమైపోయి నేటి రామాయణ మహా కావ్యానికి నాందీశ్లోకమయింది. భావపూరితమైన హృదయంనుండి వెల్లివిరిసిన కవితా ప్రవాహమే సహజకవిత. అట్టిదే పఠితలహృదయాలకు హత్తుకుపోతుంది. ప్రకృతిలో కనుపించే సుందర దృశ్యాలు మనోహర ధ్వనులు చిత్రవిచిత్ర సంఘటనలు వింత వింతలగు మానవప్రకృతులు భావుకుడైన కవి బుద్ధికి గోచరిస్తాయి. అటు తరువాత రసానుగుణ్యమైనశైలీ పాకాదులతో రచన సాగుతుంది. "రసోవైసః" అన్నారు. అనగా భగవంతుడు రసస్వరూపుడు. రసవంతమైన కావ్యం భగవంతునివలె అమరత్వాన్ని పొందగలదు.

సత్యం శివం సుందరమ్ అయిన కావ్యశ్రీకి ధీరోదాత్త లక్షణాలు కలిగిన నాయికా నాయకులను కథావస్తువుగా తీసుకున్నారు. ఉత్తమ నాయకులను సృష్టించనిదే వారు లోక కల్యాణానికి చెప్పదలచుకున్న విషయం స్వేచ్ఛగా చెప్పలేదు. సమగ్రైశ్వర్యము, సమగ్ర వీర్యము, సమగ్ర బలము, సమగ్రమైన కీర్తి, సమగ్రమగు తేజస్సులనే భగవల్లక్షణాలతో విలసిల్లే భగవదవతార పురుషులను, రాజులను, సాధుపుంగవులను, పాతివ్రత్యము, సౌశీల్యము, విద్యావినయసంపన్నలగు స్త్రీ పాత్రలను చిత్రించి వారికి ప్రాణ ప్రతిష్ఠచేసి కావ్యాల్లో చిరస్థాయిగా చిత్రించారు. పైవారికి తగురీతుల్లో తక్కిన పాత్రలను సందర్భోచితంగా కల్పిస్తారు.

మానవుడు జన్మించినందుకు ఫలితము మానవత్వాన్ని సాధించడమే. మానవునికి అసాధ్యమైన దేదీలేదు. భగవలక్షణాలన్నీ పూర్ణపురుషుని లోనుంచి కొద్దికొద్దిగా పుణికిపుచ్చుకున్నాడు. మానవుడు భగవదంశమే గనుక తల్లిని బోలిన బిడ్డవలె ఆ రూపు రేఖలన్నీ తెచ్చుకున్నాడు.

"మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః" అని గీతావాక్యం. భగవదంశావతారమైనా జన్మతోబాటు మాయావరణతో కప్పబడిపోయి అజ్ఞానాంధకారంలో పడిపోతూవుంటాడు. ఆ పతనం కలగకుండా నుండ గలందులకే కాంతాసమ్మితమైన కావ్యాలు అతిమనోహరంగా ప్రబోధిస్తూ వుంటాయి. రావణాదులవలె నడుచుకోవద్దని, రామాదులవలె కీర్తి ప్రతిష్ఠలను పొందడానికి ప్రయత్నించమని చెబుతాయి. భారత నారీరత్నమైన ద్రౌపది తమరిని అనేక విధాలుగా హింసించిన దుర్యోధనాదుల విషయంలో ఒక్క కఠిన వాక్కుకూడా పలుకలేదు. భారత యుద్ధానంతరం తన పుత్రులైన ఉపపాండవులైదుగురిని అన్యాయంగా వధించిన పుత్రఘాతకుడైన అశ్వత్థామను కట్టితెచ్చి 'వీనికేమి శిక్ష విధించమంటావని భీముడడిగితే అశ్వత్థామ తల్లి గౌతమిని తలచుకొనీ ఆమె పతివ్రత అటువంటిదానికి పుత్రశోకం కలిగించకూడదని, తన హృదయాన్ని దహింప జేస్తున్న పుత్రమరణశోకాన్ని విస్మరించి సాటి స్త్రీకి సానుభూతి చెల్పిన మహాసాధ్వి' ఇటువంటి పాత్రలను సృష్టించిన సాహిత్యం ఏ భాషలోనున్నా మనకు శిరోధార్యం.

ఇంతే కాకుండా మానవజీవిత విధానమనే మహావృక్షానికి గల అన్ని శాఖలకు సాహిత్యం మూలాధారం. పొట్ట పోసుకొనడం మొదలుకొని భగవత్సాక్షాత్కారం వరకు అన్ని రంగాల్లోను సాహిత్యానికి గల విలువ మరొకదానికి లేదని ఘంటాపథంగా చెప్పవచ్చు. అందువల్ల ఆదర్శప్రాయమైన కవితను ఆశ్రయించక తప్పదు. కొన్ని శతాబ్దాలక్రితం రచించిన కాళిదాస మహాకవి మొదలగు వారి కల్పనలు కాదనలేము. వారు విశ్వమంతా ఒకే దృష్టితో వీక్షించారు. జీవశబ్దానికి మానవులనే కాకుండా జీవకోటినంతా తీసుకున్నారు. శకుంతలను పెంచడం మొదలు పక్షులకు అప్పగించారు, శకుంతల నత్తవారింటికి పంపించేటప్పుడు కణ్వమహర్షి కేవలం గృహస్థుగా రూపొంది కంఠస్తంభిత బాష్పవృద్ధి కలుషితమైన గద్గదికతో ఆశ్రమ వృక్షాలను మృగాలను ఆశ్రమాల్లో వారి ఆధ్యాత్మిక స్పందనంవల్ల ప్రతి వస్తువు వాటివాటి కామక్రోధాది గుణాలను విడిచిపెట్టి, నిర్గుణత్వాన్ని పొందుతాయి. ఆ విషయాన్ని మన నన్నయాది కవులు ఆశ్రమవర్ణనలో ఆవులు పెద్దపులులు కలిసి ఒక చెరువులో నీరు త్రాగేవని వర్ణించారు.

రాజ్యతంత్రమంతా ఆరు మాసాల్లో నేర్పవలెనని కోరిన రాజకుమారులకు పశుపక్షిమృగాదులను పాత్రలుగా చేసి మిత్రలాభం, మిత్రభేదం, సుహృల్లాభం, సంధి, విగ్రహమునని పంచతంత్రము కథారూపంలో రచించారు. చిరస్థాయియైన ఇటువంటి సాహిత్యం యెన్నటికీ నశించదుగదా!. కాని కేవలం ప్రాచీనాన్నే అనుకరించవలెననిగాని నవీనకవుల సాహిత్యానికి విలువలేదని కాని నాయభిప్రాయం కాదు. సాహిత్యపు విలువను కాలమే నిర్ణయిస్తుంది.

ప్రాచీనమని అంతా మంచిదనుకోకూడదు. నూతనమైనదని పూర్తిగా త్రోసివేయకూడదు. బుద్ధిమంతులైనవారు చక్కగా పరిశీలించి మేలు కీళ్లను విచారించి రెంటిలో గల మంచిని తీసుకోవలెనుగాని పరులనే అనుకరించే వారిని మూఢులన్నారు. నేటి నవ్యకవులకు మార్గదర్శకులైన శ్రీగురజాడ మహాకవి పాతకొత్తల మేలు కలయిక కావలెనన్నారు. ఇంకా శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు గణపతిశాస్త్రిగారు మున్నగు వారు వివిధ భాషాపదాలను భావాలను తీసికొని సాహిత్యసుందరి నలంకరిస్తున్నారు. దేశకాలావసరాలను బట్టి వాఙ్మయంబయలు దేరుతూఉంటుంది.

ఆయాకాలాల్లో అమల్లోనున్న నాగరికత నవ్యాచారాలు మొదలైన వాటిని తెలుసుకోవలెనంటే సాహిత్యం మనకొక దర్పణంవంటిది, చిల్లరమల్లర బజారు వాఙ్మయం కూడా ఒకప్పుడు ఓట్లు ఎలక్షన్లు ప్రచారాలు ప్రబోధాలకు ఉపయోగ పడుతుంది. కాని దానికి విలువ నీడలేదు, పుబ్బలోపుట్టి మఖలోమాడి పోతూవుంటుంది.

పోతనామాత్యుడు మొదలైన వారివలె సహజపాండితీ విలసితులు లేకపోలేదు. కవిత్వము, సంగీతము, చిత్రలేఖనము, భక్తి అనే కొన్ని ఉత్తమలక్షణాలు ఒకరు చెప్పడంవల్ల నేర్చుకొనడం వల్ల వచ్చేవికావు. ఇవి జీవునకు సహజంగా వుండే గొప్పలక్షణాలన్నారు. ఇవి వాటంతట అవిపుట్ట వలసినదేగాని ప్రయత్నం చేస్తే లభించేవి కావు. అవిపుట్టిన తర్వాత సాధకులు సాధన జేస్తే పూర్ణసిద్ధిని పొందగలుగుతారు.

ఇటువంటి విశ్వమానవ కళ్యాణాన్నిగలిగించే సాహిత్యానికి విలువకాలమే నిరయిస్తుంది.

సాహిత్య ప్రమాణాలు

శ్రీమతి ఏ. ఎస్. రమాదేవి

సాహిత్య ప్రమాణాలూ అంటే అసలు వేటిని ప్రమాణాలుగా మనం తీసుకోవాలి. వేటి ఆధారంగ సాహిత్యపు స్థాయిని నిర్ణయించాలీ అన్న ప్రశ్నలు ఎదురవుతాయి. భావం, భాష, శిల్పం అనేవి సాహిత్య ప్రమాణాలు అని పెద్దలు అనేవిషయం. ముందు ఈవిషయకంగా ఈ ప్రమాణాలను క్లుప్తంగా ముచ్చటించుకుందాం.

భావమేకదా సాహిత్య ఇతివృత్తానికి, వస్తువుకి మూలం. "ఈ వస్తువు ఉన్నత మయినదిగా ఉండాలి. వడ్లగింజ, చీపురుపుల్లకూడ సాహిత్యానికి వస్తువులయితే ఎలాచచ్చేది" అనేవారున్నారు. అయితే ఈ వాదనలో పటుత్వం కనిపించడంలేదు. జీవితంలోని ఏ అంశం అయినా! ప్రపంచంలోని ఏ చిన్నవస్తువయినా రచయితని కదిలించవచ్చు. సౌలభ్యంకోసం సాహిత్యాన్ని కథగాను, కథానికగాను, నవలగాను ఇలా రకరకాలుగా విభజించుకున్నాం. ఈ విభాగాల్లో దేనికైనా వస్తువుని ఎన్నుకోవడమనేది రచయిత స్థాయిమీద, దృష్టిమీద ఆధారపడి ఉంటుంది.

ఈ సృష్టికర్త ఎవరోకాని నిజంగా బ్రహ్మాండ రచయిత. ఎంత అందంగా, ఒక్కవృథా పాత్ర అనేదాన్ని సృష్టించకుండ, ఇన్నిరకాల జీవకోటిని సృష్టించి, అతి విశాలమైన ఇతివృత్తంతో అమోఘమైన పరాకాష్ఠను అందిస్తూ, ఒకక్షణం వ్యక్తిని సంతృప్తిపరుస్తూ, మరుక్షణం వ్యక్తిని అయోమయంలో పడేస్తూ, అబ్బురపరుస్తూ ఈ జగత్తును రచించాడు. ఇదెందుకు చెబుతున్నానంటే సృష్టిలో ఏ వస్తువూ అయాచితంగా పడిలేదు. అందుచేత ప్రపంచంలోని ప్రతిదీ సాహిత్యానికి తగిన వస్తువే. కాకపోతే కొన్ని కొందర్ని ఎక్కువగా ఆకర్షిస్తాయి వారి వారి అభిరుచుల్నిబట్టి, రచయితకు చేతనవాలేగాని ఏవస్తువునైనా తీసుకొని ఉదాత్తంగా దానికి రూపురేఖలు దిద్ది పాఠకుల్ని మెప్పించవచ్చు,పోతే "ప్రజాజీవితం నుంచి మంచి సాహిత్యం సృష్టింపబడాలి" అంటారు సురవరం ప్రతాపరెడ్డిగారు.

"దైనందిన జీవితంలో సంఘటించే వ్యవహారాలు, విన్నవిచిత్రమైన విషయాలే సాహిత్యానికి పునాదిగ ఉంటాయి" అంటారు హీరాలాల్ రాయ్‌గారు.

"మనం తీసుకునే ఇతివృత్తాలు సమాజాభ్యుదయానికి తోడ్పడేవై సాంఘిక ప్రయోజన కారులుగ ఉండాలి, అందుకోసమే రచయిత వ్రాయాలి" అని అంటారు గోపిచంద్‌గారు, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు మొదలైన వారు. ఈ విషయంగా చూస్తే తెలుగు సాహిత్యంలో, ఈ ఆధునికకాలంలో వెలువడ్డ చాలా రచనలు, "సంఘ శ్రేయస్సుకోసం మేంవ్రాస్తున్నాం; జీవిత సత్యాలను చాటుతున్నాం అన్నధోరణిలో కంటె రచయితలు తమలోని ఆరాటాన్ని, ఉద్వేగాన్ని తీర్చుకోవడానికి వ్రాసినట్లుగా ఉన్నాయి. వీటివల్ల సంఘానికి మంచి జరగడం లేదంటే ఎలా, సంఘంమీద? వాటి ప్రభావం తప్పకుండా ఉంది. అయితే అది యాదృచ్ఛికం కావచ్చు, రచయిత అసలు 'నేను సంఘాన్ని ఉద్ధరిస్తున్నాను. నా రచనలతోను' అని అహం పెంచుకోవడం మూర్ఖం. సంఘశ్రేయస్సుని మనసులో ఉంచుకోవడమనేది రచయితకనీస ధర్మం.

అసలు రచయిత సంఘాన్ని కలుషితంచేయాలని ఏ రచనా చేయడు. ఒకవేళ తెలివితక్కువల్ల అలాంటిపని జరిగినా, అది అట్టేకాలం ఏలాగూనిలవదు.

ఇక భాషాస్థాయి, ప్రమాణం ఎలాఉండాలీ అంటే, మానవునికి సంబంధించిన అన్ని విషయాలను సాహిత్యానికి తగిన వస్తువులుగ చేపట్టినప్పుడు మానవుడు నిత్యజీవితంలో వాడుకునే భాషను వాడడం సమంజసం. ఆ నుడికారం ఎవరి వాతావరణాన్ని బట్టి వారికి పరిసరాలను అనుగుణంగ అలవడుతుంది మానవుని పరిభాషలోనే వాక్యాలుండాలీ అన్నది ఈ నాడు చాలామంది ఒదయికుంటున్న విషయమే. నామట్టుకు నాకు సాహిత్య ప్రమాణాలలో భావానికున్న స్థానం భాషకు లేదేమోననిపిస్తోంది. భావాన్ని వ్యక్తపరిచేది భాష. అది ఒకసాధనం మాత్రమే. అది లక్ష్యంకాదు. అయితే ఆ సాధనం కూడా సుందరంగా ఉండాలనుకోవడంలో తప్పులేదు భావ గాంభీర్యానికి తోడు భాషాగాంభీర్యంకూడా ఉంటే ఒప్పుతుందేమో కాని, అసలు భావమే లేకుండా పెద్ద పెద్ద ప్రయోగాలు, సమాసాలతో కూడిన భాష ఉంటే దానిని హర్షించలేం. అసలు అర్థం కానంతటి సమాసాలతో వ్రాస్తే రచన సాంతం చదవకుండానే ప్రక్కన పెట్టవలసి వస్తుంది. అసలుకే మోసం జరుగుతుంది.

ఇక శైలి ఎలావుండాలంటే, ఇలా వుండాలీ అన్న నియమం ఏమిటి? శైలి ఎలావున్నా అసలు అది

పాఠకుల్ని చదివించేటట్టు ఉండటంమాత్రం ముఖ్యం. పైన ఎవరిపద్ధతి వారిది అసలు ఈ వైవిధ్యమే లేకపోతే సాహిత్యానికి అందంలేదు. ఒకరి శైలిని మరొకరు అనుకరించడానికి పూనుకోవడ మంత పొరపాటు మరొకటిలేదు. చేయితిరిగినకొద్దీ రచయిత కలానికి శైలి ఏర్పడుతుంది. జూనాధన్ స్విఫ్ట్ అనేదేమిటంటే "యుక్తమైనస్థలాల్లో యుక్తమైన మాటలుండాలనడమే శైలియొక్క యథార్థ నిర్వచనమూ" అని. "రచయిత వ్యక్తిత్వమే శైలి" అంటాడు ఫ్రెంచి విమర్శకు డొకాయన. ఇందులో చాలా సత్యం కనపడుతోంది. అసలు రచయిత పాఠకుల్ని పలకరిస్తూవుండేది తన శైలిద్వారానే. అందులో ప్రతిబింబించే తన సహజ స్పందన, వ్యక్తిత్వం, సానుభూతి ఇవి పాఠకుల్ని ఎక్కువగా పట్టేస్తాయి.

ఇలాంటి ప్రమాణాలను కలిగిన సాహిత్యం సాధిస్తున్న దేమిటి?... అసలు ఈ ప్రమాణాలు భావం, భాష శిల్పం ఇలాంటి వాటికే పరిమితమైవున్నాయా, ఇంతకు మించిన ప్రయోజనం ఏమిలేదా సాహిత్యానికి అంటే, ఇప్పటి వరకు మనం ముచ్చటించుకున్నది కనీస ప్రమాణాలను గురించి. మానవుడికి తిండి, బట్ట, ఇల్లు అవసరం అంటే అంతకుమించిన అవసరాలు అతనికిలేవని కాదుగా!.... సాహిత్యం అనేది, ఆమించిన అవసరాలలో, ముఖ్యంగా మానసికమైన అవసరాలను, ఆత్మకు సంబంధించిన ఆకలిని తీర్చగలగాలి.

ఆదికాలంలో ఋషి అయినవాడే రచనచేస్తాడు. ఆ రచన నీతిబోధకంగా, ప్రజలను ధర్మమార్గంలో పెట్టడం కోసం చేయబడేది. పరిస్థితులు మారుతూ వస్తున్నాయి. మానవుని మేధస్సుతో పాటు, నాగరికత, సంస్కృతి విస్తృత పడుతూ వస్తున్నాయి. కేవలం జూదం, వ్యభిచారం, తాగుడు ఇవేకాదు అవినీతిచర్యలు. ఇతరుల బాగునుచూసి ఈర్ష్యపడడం అవినీతి. ఇతరులను బాధించి ఆనందించడమనేది అవినీతి. కల్లబుల్లి కబుర్లతో అమాయకులను మోసగించడం అనేది అవినీతి. ఇలాంటి చర్యల వల్ల ఎందరి అమాయకపు మనసులు నలిగిపోవడం లేదు? వాటన్నింటినీ సజీవమైన పాత్రలతో మనకళ్ళ ముందు పెట్టి, వాటి దుష్ఫలితాలను విప్పి చెప్పడం రచయితలవిధి. అసలు మనిషి తెలియక, అజ్ఞానంలో అవినీతికి పాల్పడడంలేదు. తెలిసి తెలిసే తనలోని దౌర్బల్యం వల్ల చేస్తున్నాడు. మనలోని ఇలాంటి బలహీనతలను అణచుకోవడానికి, నిర్మూలించుకోవడానికి తగిన ఆత్మశక్తిని సాహిత్యం ప్రసాదించ గలగాలి.

"జాతి జీవితాన్ని, ప్రజల ఆశయాలను, వారి ఆశా ఛందాలను వీటన్నింటినీ ప్రతిబింబింప జేయాలి సాహిత్యం" అంటారు శ్రీవాత్సవ.... ఇదినిజమే. అయితే అది అక్కడనే ఆగిపోదు. ఈ మధ్యనే ప్రఖ్యాత రచయిత్రి పెరల్‌బక్ వెలిబుచ్చిన అభిప్రాయం ఏమిటంటే, "రచయిత తానున్న వాతావరణంనుంచి, తను బాధపడుతున్న సమస్యలనుంచి అధిగమించి విశాల దృక్పథంతో, అన్నికాలాలకు సరిపడేవిధంగ రచనలు చేయాలి" అని. ప్రస్తుతజీవితాన్ని ప్రతిబింబింపచేసే సాహిత్యం ఎంతఅవుసరమో, మనకు భవిష్యత్తుకు దారి జూపే సాహిత్యమూ అంతే అవసరం.

ఏకాలంలో అయినా ప్రజలంతా ఒకేస్థాయిలో ఉండరు. వివిధస్థాయిలలో ఉన్న ప్రజలకు వివిధస్థాయిలలో ఉన్న సాహిత్యం అవసరం అవుతుంది. అసలు చదవడమే అలవాటులేని ప్రజలకు మొట్టమొదట కేవలం కాలక్షేపానికి పనికివచ్చే పుస్తకాలయితేనే కాస్త చదవడానికి ప్రోత్సహిస్తున్నాయి అందుచేత కొంత సాహిత్యాన్ని తేలిక సాహిత్యం అని నిరసించి దాని అవసరం అసలు లేదని అనుకోవడానికి వీలులేదు. ఎవరికీ పనికిరాని దశలో సాహిత్యం దానంతట అదే రూపు మాసిపోతుంది. దానినిగురించి ఎవరమూ అట్టే బెంగపడనక్కర్లేదు.

మనకు స్వాతంత్ర్యం లేని రోజుల్లో దేశభక్తిని ప్రబోధించే రచనలుకో కొల్లలుగా వచ్చాయి. సాంఘిక దురాచారాలవల్ల స్త్రీబాధ పడ్డరోజుల్లో ఆ ఇతివృత్తాలతో రచనలు వచ్చాయి. .... అయితే అలాంటిరచన ప్రమాణాలు తాత్కాలిక ప్రమాణాలు, సర్వ కాలాలకీ, సర్వ ప్రజలకూ పనికివచ్చేసాహిత్యం, వ్యక్తిలో ఆలోచన రేకెత్తించి; అతనిని ఉన్నత పథాలకు తీసుకొనిపోయే విధంగా సంచలనం కలిగించే ప్రమాణం కలిగిన సాహిత్యం అవసరం. వ్యక్తికి తన తీరని అన్వేషణలో తోడు నిస్తూ, ఈ భౌతికప్రపంచంలో ఉన్నతంగా బ్రతకడానికి కావలసిన ఆధ్యాత్మిక భావాలను అందించగలిగిన ప్రమాణం సాహిత్యానికిఅవసరం. విభిన్నశక్తులమధ్య విచ్ఛిన్న మార్గాలమధ్య మనకునచ్చిన మార్గంలో మనం పురోగమిస్తూ, సమన్వయ దృష్టితో జీవితం గడపడానికి సాహిత్యం దోహదమివ్వాలి.

ముఖ్యంగా మనవేదాంతరీత్యా వ్యక్తి దైవాంశ సంభూతుడు. అయితే అది అజ్ఞానంవల్ల, తదితర కార

కాలుగ మరుగున పడిఉంటుంది. అది ప్రతివ్యక్తి గురించి, తనవ్యక్తిత్వాన్ని ఆ అంశనో వెలికి తెచ్చుకోవడానికి తగినశక్తిని, స్ఫూర్తిని కలిగించడానికి సాహిత్యం తోడ్పడాలి. ఈ సాహిత్య ప్రమాణం ఒక్క పాఠకులకే వర్తించదు. అది ముందురచయితలకే వర్తిస్తుంది ఒక్కొక్క రచన చేసినతరువాత రచయితహృదయం మరింతగ విశాలపడాలేగాని కుంచించుకు పోకూడదు. తనలో మరుగుపడిఉన్న వ్యక్తి దివ్యత్వపు వెలుగులను వెలికితెచ్చుకోవడం, వ్యక్తిలక్ష్యం. తన హృదయంలో విశ్వమంతా దాగేటంతగా విశాలపడటం వ్యక్తిలక్ష్యం. ఆ లక్ష్యానికి సాధనంగా ఉపయోగపడటమే సాహిత్యపు శాశ్వత ప్రమాణం.

ఉత్తమ సాహిత్యము

శ్రీమతి గాడేపల్లి సుందరీశంకరం

ఏస్థాయికి చెందిన సాహిత్యమైనా విశ్వశ్రేయస్సును ఆకాంక్షించునదీ, విశ్వమానవ సౌభ్రాతృత్వమును ప్రబోధించునది, విజ్ఞాన దీపికల వెలయించుచు, మన సంస్కృతిని పరిరక్షించి పోషింపుచు, మన జీవిత విధానముల తీర్చిదిద్దుచు మనలను ధర్మ మార్గావలంబకులనుగా చేయునది సాహిత్యమనిపించుకోను. అందుచేతనే

"కావ్యం యశసేర్థకృతే, వ్యవహారవిదే
శివేతర క్షతయే సద్యః పరనిర్వృతయే
కాంతాసమ్మిత తయోపదేశయుజే"

అన్నారు. ఈ కావ్యప్రయోజన నిర్వచనమునే వందలాది సంవత్సరాలుగా మన పెద్దలు గౌరవిస్తూ వచ్చారు. మాటలాడుకొను భాషతోనే మహత్తర భావముల నిమిడ్చి వ్రాసిన మహాకవులున్నారు. కఠిన పదభూయిష్టమై పండిత జనరంజకం గానే ధర్మ ప్రబోధమొనరించిన పండిత ప్రకాండులున్నారు. పదజాలము జటిలమై యున్నంత మాత్రంచేత అది ఉత్తమ తరగతికి చెందిన సాహిత్యమనిపించుకోదు. వాడుక భాషలోనే యెంకి నాయుడు బావల సాహిత్యంతోనే ఉత్తమ భావములను, ఉదాత్తాశయములను వెదజల్లగలిగినది సాహిత్యమనిపించుకొనకనూ పోదు.

మాటలాడునదంతయు భాష కావచ్చును. శబ్దమంతయు గానమనుకోవచ్చును. ప్రకృతి యంతయు చిత్ర లేఖనముగను, శిల్పముగను భావింప వచ్చును. అయితే సహజమైన భావమును సరసవచనా సౌరభముతోను, ప్రకృతి సిద్ధమైన ఆకారమును సశాస్త్రీయముగ సంస్కరించి చిత్రించిన నాడు మనోహరంగా వుంటుంది. ఉదాత్తమైన భావములకు, ఉజ్వలమైన రూపకల్పన చేయగల్గిన నాడు శాశ్వతత్వమును పొందుతుంది. దివ్యద్రష్టయైన కళాస్రష్టయే యుగయుగాంతముల వరకు జీవింపగలుగుచున్నాడు. పుబ్బలో పుట్టి మఖలోనే మరణించు సాహిత్యమునకు ఉత్తమస్థాయి యెలా లభిస్తుంది?

అంతర్ముఖులై, ఆత్మానుసంధాతలైన మహాత్ములే బాహ్య ప్రపంచమును ఉత్తేజితపరచి నడిపింపగల సమర్థులు. అట్టి మహావ్యక్తుల హృదయాలలోని శివుడు సత్య, శివ, సుందరుడై కవిగానో, గాయకునిగానో, చిత్రలేఖకుడు గానో, శిల్పాచార్యుడుగనో, నటకావతంసుడుగనో, లోకకల్యాణార్థమై వెలయుచున్నాడు.

సామాన్యులైన మానవులయందే మాన్యులైన కవిపుంగవులు జనించి ఋషిపుంగవులై రసవత్తర కావ్యములను రచించి దివ్యజ్యోతుల దశదిశల వెలయించి అజ్ఞాన తమస్సునందల్లాడు అంధమానవాళికి విజ్ఞాన దీపికలు వెదజల్లుచు, స్వార్థరహితులై సరసరచనా ప్రాభవముతో సర్వమానవ సౌభ్రాతృత్వమును గడుపుచుందురు.

మహాకవుల కావ్యంలో ప్రతిఫలించేది కవియొక్క భౌతికరూపం కాదు. కవియొక్క అంతరాత్మ, "విశ్వశ్రేయః కావ్యమ్" అన్న పెద్దల నానుడికి అంతరార్థమున్నది. ఏకవి మానవకోటి ఆశయాలకు, ఉదాత్తమైన ఆకాంక్షలకు, అనుభవాలకు, ఆదర్శాలకు రూపకల్పన చేయగల్గుచున్నాడో అతడు మహాకవి యనకతప్పదు.

అతని సాహిత్యము ఉత్తమ తరగతికి చెందిన సాహిత్యమనక తప్పదు. అతనిది మహాకావ్యమనక

తప్పదు. అది యుగధర్మమును చాటుతుంది. అది విశ్వశ్రేయస్సునే ఆకాంక్షిస్తుంది.

శిష్టవ్యవహారికమనీ, గ్రాంధికమనీ రెండేతెగలు మన తెలుగుసాహిత్యంలో కనబడుతున్నాయి. ఏతెగకుచెందిన సాహిత్యమైనప్పటికి విశ్వవ్యాప్తమైన చైతన్యశక్తిని తనలో ప్రసరింప జేసుకొని, తన హృదయాలయమున నున్న శివుని ఉద్దీపుని గావించి తన మాటచేతనో, ఆట చేతనో,పాటనచేతనో, మనలను తాదాత్మ్యమును పొందింపజేయగలిగి నాడు అది ఉత్తమ తరగతికి చెందిన దని మాత్రము చెప్పవలిసి ఉంటుంది. మనస్సును హరించి, మనోహరముగ నుండనినాడు ఆత్మాను సంధానము చేయించి తాదాత్మ్యమును పొందింపనినాడు అట్టికళా సృష్టి నిరర్థకము, నిష్ప్రయోజకమే అవుతుంది. అది యెడారి బ్రతుకుల్లో దివ్యప్రేమను ఫలింపచేయలేదు. మన సంస్కృతినిగాని, సాంప్రదాయములనుగాని, పరీక్షించి పోషింపలేదు. నిర్వీర్యము నిస్సారము అయి నిబిడాంధకారమున మనలను నిలిపివేస్తుంది. అందుచేతనే

ఒకమహాకవి !

"నానోట నీమాట గానమయ్యేవేళ
నాగుండె నీవుండి మ్రోగింపవావీణ"

అని వేడుకొన్నాడు. మరియొక కవి "పలికించెడు వాడు రామభద్రుండట నేపలికిన భవహరమగునట" అని వ్రాక్రుచ్చినాడు.

ఇట్టిమహత్తర భావములను ఆదర్శంగా వుంచుకొన్న దగుటచేతనే కుమ్మరిమొల్ల సీతమ్మవారినోట అంజనేయునితో తనస్థితిని రామునకు యెరిగించు సందర్భంలో పతి దూరంగావున్న పత్నీహృదయాన్ని యెంత సాంప్రదాయసిద్ధంగా చిత్రించిందో చూడండి.

ఏయెడ జూచిన ధరణీ
నాయకు శ్రీపాదయుగము నాచిత్తములో
బాయదని విన్నవింపుము
వాయుతనూజుండ పుణ్యవంతుడ తెలియన్.
నిడుదపున్నెరివేణి జడలుగా సవరించి
మలిన జీర్ణాంబరం బొలియగట్టి
భూమీరజంబు విభూతి పూతగబూసి
తన దివ్యమూర్తి చిత్తమున నిల్పి
నిరశన స్థితితోడ నిలిచి భూశయ్యను
బవళించి, నిదుర యేర్పడగ విడిచి
తారక బ్రహ్మమంత్రంబు బఠింపుచు
కఠిన రాక్షస దుర్మృగములలోన
సహితలంకా మహాద్వీప గహనసీమ
దపము జేయుచున్నాను తన్నుగూర్చి
నాకు ప్రత్యక్ష మగునని వాదునకును
విన్నవింపుము సత్య సంపన్నునీవు॥

అలాగే నాకు పూజ్యురాలు మాతృదేవతా స్వరూపురాలైన స్వర్గీయ కాంచనపల్లి కనకాంబగారు కూడ ఒకానొక సందర్భమును పురస్కరించుకొని స్త్రీధర్మాన్ని నిర్వహించి చెప్పగలిగింది.

గురు నుప దేశశక్తి ననుకూల
సతీమణి సేవభక్తిచే
కరమను రక్తిచే, ప్రబల కామముచే
మహనీయ సూక్తిచే
సరసపు దృష్టిచే విమల సాత్విక
భావముచే సదామనో
హరముగ గొల్చుచుండిన జీవుడు పరాత్మను
జెందెడు రామ సత్కృపన్.

ఇది ఉత్తమ సాహిత్యానికి సంబంధించిన దనటంలో సందేహంలేదు.

శృంగార, హాస్యకరుణ, బీభత్సకాది నవరసములలో ఏరసమును పోషింపవలసి వచ్చినను సాంప్రదాయములను పాటించి రసోత్పత్తిని కలిగించునది మాత్రమే ఉత్తమ తరగతికి చెందిన సాహిత్య మౌతుంది.



శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

౧

ఉమకును రమకును వాణికి
నమర నొకేరూపమంది యవని జనింపన్
తమకమొదవ స్త్రీ కల్ప
ద్రుమమై యిట బుట్టితీవు దుర్గాబాయీ!

౨

అక్షయ ధనములు గూర్చుట
శిక్షణతో విద్యనేర్పి స్త్రీజన సేవన్
దక్షత నెరపుట నీ ప్ర
త్యక్షని దర్శనము దేవతాత్రయమునకున్

౩

తెనుగుతల్లి కడుపు తీయని పంటవై
అవని నీవు జనన మందుటెల్ల
తెనుగు సతుల పుణ్యదివ్య ఫలమెగాదు
భారతాంగనా తపంబె పండె!

౪

విద్యావిహీనలౌ వెలదుల బ్రోవంగ
విద్యాలయములెన్నొ బెట్టినావు
విద్యాలయమె గాదు వేతనమేలేక
ఉచిత విద్యల నేర్ప నూనినావు
ఉచిత విద్యయెగాదు యువిదలు వసియింప
వసతి గృహంబుల నొసగినావు
గృహము లిచ్చుటెగాదు కృపణులౌ వారికి
భోజనాదులు పెట్ట బూనినావు
భోజనాదులె గాదు భూరికృపను వస్త్ర
పుస్తకాదులనెల్ల పొసగ నొసగి
స్వల్పకాలపు విద్యను జదువజేసి
కాచుచుంటివి వనితల కనికరమున
సంఘసంక్షేమ పాలన స్థానమొంది
సోదరీ దుర్గబాయినీ వాదరమున
స్త్రీల కొనరించు నుపకృతుల్ తెలుపవశమె

౫

విద్యయొకటె గాదు వికలాంగ జనరక్ష
నేరజాతి వారి నెమ్మిగనుట
పతిత స్త్రీల మేలు బాలలపోషణ
అహహ! నీదు సేవకవధి గలదె?

౬

మంచివాడు చాల మహనీయ గుణమూర్తి
ప్రజల సేవయందు ప్రముఖుడంచు
దొరల మెప్పుగన్న పెద్ద చింతామణి
దేశముఖున కెవరు దీటుగలరు?

౭

అంత ప్రముఖవ్యక్తి యక్కరో! తోడ్పడ
స్త్రీల నెగులు వగలు తీర్చుపనుల
బావగారు నీవు బహుకాల మిట్టులే
సేవ జేయవలతు దేవుకృపను.

కొత్తచోటైనా పాతమనుషులే

శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి

పద్మకి భర్త రాఘవరావు వచ్చి చెప్పినవార్త విన్నదగ్గరనించీ, సంతోషంతో మనస్సు రకరకాలగా పురకలు వేస్తూంది.

ఎక్కువసేపు మనస్సులో నిలుపుకోలేక పక్కఇంట్లో కాపరమున్న శ్యామల్ని పిల్చి, మావారికి ప్రమోషనుతో ట్రాన్స్ఫర్ అయిందో అనిచెప్పి, పమిట కొంగుతో మొహం తుడుచుకుంది. ఆ, ఇన్నేళ్ళసర్వీస్ వుండి ఇప్పటికి రావటం ఏమంత గొప్పకాదులే, మా బావ రాత్రే చెప్పాడు. మీ ఆయన్ని పంపేచోటికి అతన్ని వెళ్లమంటే, నాకు ప్రమోషనువద్దు ఏమీవద్దు నన్ను ఇక్కడినించి కదపవద్దని బతిమాలుకున్నాట్ట అని అక్కసు వెళ్లబోసింది, శ్యామల. ఎందుకు చెప్పేనా? అని మనస్సు చివుక్కుమని, వస్తానంటూ లోపలికి వెళ్లిపోయింది పద్మ. రాఘవరావు స్నేహితులు ఒకరొకరే వచ్చి సంతోషాన్ని వెళ్లబోస్తూన్నట్టు మాట్లాడి, పార్టీ ఎప్పుడంటూ కాఫీ కప్పులు ఖాళీచేస్తున్నారు.

క్లబ్‌కి వెళ్లాలన్న ఆత్రంతో ఇంటికి వచ్చేవాళ్లమీద విసుక్కుంటోంది పద్మ. చూడు, ఈనాలుగురోజులు వచ్చేవాళ్లని భరించటం తప్పదు. కనుక ఎవర్నయినా వంటకి పెట్టరాదూ? అని రాఘవరావు పద్మని సముదాయిస్తూ అన్నాడు. మరే, మనంపిలిస్తే వద్దామని సిద్ధంగా కూర్చున్నారు వంటవాళ్లు, మీ మాటలన్నీ ఇల్లాగే వుంటాయి అంటూ మళ్లీ కాఫీతో కప్పులు నింపి, రాఘవరావుకిచ్చి పంపింది.

ఎల్లాగో తెములుచ్చుకు క్లబ్బు ఆవరణలోకి చేరుకుంది పద్మ. వరండాలో వెలిగే దీపంకాంతి గేటుదగ్గర చేరేసరికి చీకటి కలుపుకుంది. హాల్లో దీపాలు అద్దాల తలుపులులోంచి మసగ్గా కనపడుతున్నాయి. వేప చెట్లు తలలూపుతున్నాయి. ఎంతో నిశ్శబ్దంగావున్న హాల్లోంచి వక్కసారి చాలా కంఠాలు పై స్థాయిలో మొదలుపెట్టాయి ఘర్షన.

గుమ్మంలో నిల్చుని అందర్నీ తెల్లబోయి చూస్తోంది పద్మ. పేకముక్కలు విసిరివేసినవి, బల్లలకిందకి చేరి దాక్కుంటున్నాయి. తన సంతోషం అందరికీ చెప్పి ఆనందిద్దామనుకున్న కోరిక ఆ వాతావరణంలోకి రాగానే మనస్సులోనే మరుగుపడింది. క్లబ్బుశక్రటీకి కమిటీ మెంబర్లకి మధ్య వివాదం ఎక్కువయింది. కొందరు పద్మదగ్గరకి వచ్చి చెప్పుకుంటున్నారు. ఎంత అన్యాయం జరిగిందో పోనీ ఆ ఆట లేదు అనుకుని మళ్లీ కొత్తగా మొదలుపెట్టక పోయారా? అని పద్మ వాళ్లతో అనటం క్లబ్బు శక్రటీ విని.

మహా తీర్పు చెప్పావులే అంతా వకరకం జట్టు కనకనే నీదగ్గర మొరపెట్టుకుంటున్నారు. ఓర్వలేని గుణాలు అని కంఠము బిగపెట్టుకు పూపిరితియ్యకుండా అనేసింది. కసిగా క్లబ్బు శక్రటీ. కమిటీ మెంబర్లలో వకామె కొంగు దోపుకు కొద్దిగా ముందుకువెళ్లి మీరు చాలా అమర్యాదగా మాట్లాడారు. మొదట మా అందరికి అపాలజీ ఇచ్చితీరాలి, అని శక్రటీని గదమాఇంచింది. నాకు అవసరంలేదు ఇవ్వనని ఆమె ఇచ్చి తీరాలి అని ఈమె వాదన పెరిగి క్లబ్బు ప్రసిడెంటుని పిలిపించేదాకా జరిగి ఆవిడ రాకతో ఇద్దరూ, రెండో వాళ్లదే తప్పు అని తోచే సమర్ధతో చెప్పుకున్నారు. శక్రటీని మీరు కొంచం తొందరపడ్డారనిపిస్తోంది అని, ఎవరము సర్దుకున్నా పోయేది అని కమిటీ మెంబర్సుతో రాజీగా చెప్పింది ప్రసిడెంటు. ఆవిడ అపాలజీ ఇచ్చి తీరాలని అంతా గట్టి పట్టుపట్టారు. శక్రటీ కళ్లనీళ్లు తుడుచుకుంటూ, ఛీ, ఇంక ఈ క్లబ్బుకి శక్రటీగా నేను వుండనని చెపుతూ అసలుఅంతా పద్మనించే ఇంత వరకూ వచ్చింది. ఇవాళ ఆవిడ మొగుడుకి పెద్ద పదవి వచ్చిందనేగా మీరంతా ఆవిడదగ్గర మొరపెట్టుకోవటం, ఇన్నాళ్లులేని మర్యాద వక్కసారి మీ అందరికీ పుట్టుకొచ్చింది. మాఆయనకి వాళ్లకీ వీళ్లకీ చాకిరీలు చెయ్యటం, కూరలు మొయ్యటంరాదు, వస్తే ఆయనా ఆఫీసరయ్యేవారు అంటూ మొహం వికృతంగా తిప్పుకుంటూ అనేసింది శక్రటీ.

పద్మ వుత్సాహంఅంతా నీరుకారినట్టుఅయింది. ఆరోజు లేచినవేళ ఎంత మంచిదో అని ముందు మురిసినంతసేపు పట్టలేదు. తన సంతోషం ఎవరితో చెప్పుకుందామన్నా వాళ్లే ఈర్ష వెళ్లబొయ్యటంతో పద్మ సంతోషం దుఃఖంగా మారింది.

క్లబ్బు ప్రసిడెంటు మాకు చెప్పనేలేదే మీవారికి ప్రమోషను వచ్చినట్టు, అంటూ చాలా సంతోషం అని పద్మ వీపు చేత్తోరాస్తూ అవ్వే అల్లా కష్టపెట్టుకోకండి. ఆవిడ మాటలకేం, అయినా మీరు బొత్తిగా సభ్యత

లేకండా మాట్లాడారంటూ శక్రట్రీని మందలించినట్టు మాట్లాడింది. పద్మ వాళ్లఅందరిదగ్గర సెలవుతీసుకు ఇంటికి చేరేసరికి రాఘవరావు సామాన్లన్నింటినీ మధ్యగా పోగుపెడుతున్నాడు. పద్మని చూడకండానే ఏమిటీ ఇంత సేపు చెప్పుకోవాలా ఖబుర్లు అని అడిగాడు.

పద్మదగ్గరనించి సమాధానం రాకపోవటంతో వెనక్కితిరిగి చూశాడు, ఏం? స్నేహితుల్ని విడిచి వెళ్లాలని విచారమా? చిత్రమే, మీ ఆడాళ్లు వకచోట వుంటే వకళ్లమీద వకళ్లు చెప్పుకోవడమో, లేక తగూలు పెట్టుకు మాటలు మానుకోవడమే లేకపోతే, అందరికంటే అతీతులమన్నట్టు నోరు తెరచి ఎవరితోనూ మాట్లాడకండా విడిగా వుండటమో జరుగుతుంది. తీరా అందులో వక్కళ్లు దూరంగా వెళ్లిపోతున్నారంటే కొందరి కళ్లయినా చెమ్మగిల్లుతాయి. అవునా? అంటూ పద్మదగ్గరకివచ్చి వంచిన తల పైకి ఎత్తి కళ్లల్లోకి చూశాడు రాఘవరావు.

అబ్బే అటువంటిదేమి జరగలేదు అంటూ కళ్లు తుడుచుకుని క్లబ్బులో జరిగినదంతా చెప్పింది పద్మ. అవిడ ఎల్లాగా ఏడుస్తోందిగా, ఇంక నువ్వు ఏడవకూడదు అవిడన్నవాటికి, సరేకానీ ఇంకో మంచివార్త మన డాక్టరు స్నేహితుడు వచ్చాట్ట. వాళ్లచుట్టాలింట్లో నోవాటా ఖాళీఅయిందని అది ప్రస్తుతం ఇంకా ఎవరికీ ఇవ్వలేదు అన్నాట్ట. ఇకనేమంటాడంటే మన సామాన్లు లారీలో అతనితో పంపితే అతనే సర్దిస్తాడంటాడు. దానికే ఈ హడావిడి అని చెప్పుడు రాఘవరావు. అన్నింటికీ తొందరెక్కువ బాబూ మీకు, ముక్కూ మొహం ఎరగనివాడితో సామాన్లు పంపటమేమిటి? అని విసుక్కుంది పద్మ.

డాక్టరు ముక్కు ఎరుగుదుంగా అంచేత నాకేం భయంలేదు అన్నాడు రాఘవరావు, నవ్వుతూ. కొన్ని సామాన్లు తగ్గించాలి అని కవరు దూరంగా పెడితే ఇంకొకరు కావాలంటూ మధ్యకి చేరవేస్తూ, చాలా సేపు గడిపారు, డాక్టరు రాకతో ఇద్దరూ వకమాటకి వచ్చారు. సామాన్లతో లారీ బయలుదేరేసరికి తెల్లారవచ్చింది.

పెళ్లివారు వెళ్లిన ఇల్లులా బోరుమంటోంది. ఇంకా వెళ్లేందుకు నావకాశంవున్నా, రెండురోజులు ముందే వెడదామని పద్మ పట్టుపట్టడంతో రాఘవరావు వప్పుకోక తప్పలేదు. మిగిలిన సామాన్లు డాక్టరింట్లో పెట్టి ఆరోజు బయలుదేరారు. డాక్టరు చుట్టానికి పిల్లని కలుసుకోమన్నవార్త ముందే తెలియపర్చటంలో, ఇల్లు వెతుక్కునే బాధ కొంత తగ్గిందికూడా. తెచ్చిన సామాన్లు పైకి చేర్చుకుంటూంటే పక్కవాటాల్లోంచి చూసేకళ్లు ఆశ్చర్యాన్ని వెళ్లబెడుతున్నాయి. పద్మని మేడపైకి పిల్చుకువెళ్లి వాళ్లభాగం చూపెట్టాడు. ఇంత సామాన్లు ఈ వాటాలో ఇముడుతుందా? అని భయపడింది పద్మ. ఇల్లు చిన్నదయినా హాంగులు చాలా వుండటంతో అన్నీ సర్దేసరికి ఇల్లు విశాలంగావున్నట్టే తోచింది, చాలాకాలంగా మర్చిపోయిన కూరల సంచీ రాఘవరావు చేతికి వచ్చింది. డాక్టరు స్నేహితుడు తరుచు వచ్చి యోగక్షేమాలు కనుక్కుని వెళ్లటం కొంత సాయంగావున్నది. పద్మకీ, రాఘవరావుకీ ఏదో బెంగగానేవుంది. భాషతోకొంత ఇబ్బంది పడ్డా ఎల్లాగో అలవాటుపడాలని వకరికొకరు ధయిర్యం చెప్పుకుంటూ గడుపుతున్నారు. పద్మకి తలుపులు వేసుకు గదిలోకూర్చోటం కిటికీలోంచి దూరంగా కనపడే కొండ లోయల్ని చూస్తూంటే కాలం జరిగి పొద్దు జరిగి కొండ కిందకి దిగటం రాఘవరావు వచ్చే అలికిడికి, తలుపులు తెరవటం నిత్యకృత్యాల్లో వకటిగా అయింది.

ఆ రోజు రాఘవరావుకూడా కొందర్ని తీసుకు రావటం చూసి, పద్మకి ముందు కొంత ఆనందం కలిగింది. పద్మకి వచ్చినవాళ్లని ఫలానాఅని రాఘవరావు పరిచయంచేసి బట్టలు మార్చేందుకు లోపలి కెళ్లాడు. అందులో కొద్దిగా వయస్సు మళ్లిన ఆయన బట్టతల చేత్తోరాసుకుంటూ, మనం దూరంగా వుండబట్టి కానీ చాలా దగ్గిర వాళ్లంకాదూ? అంటూ సంభాషణలోకి దిగాడు. రాఘవరావు అక్కడికి రావటంతో పద్మ వంటగదిలోకి వెళ్లింది. పద్మ పళ్లాల్లో ఫలహారాలు సర్దుతోంటే అంతా ఇల్లుచూస్తూ అక్కడికి చేరారు. మీకు ఇంతతొందరగా ఇల్లు ఎల్లాదొరికిందండీ అంటూ వుసూరుమన్నాడు. అందులో వకాయన ఎందుకుదొరకదండీ? అసలు వీళ్లకోసం ఒక ఇల్లు చూసిపెట్టాను వీళ్లు నాదగ్గర్కి అసలు రాకపోయేసరికి వద్దనిచెప్పేశాను అని ఇంకోఅయన సమాధానం ఇచ్చాడు. మాకు చూడమంటే ఇంకాచూస్తూనే వున్నారు కాదా ఎక్కడోవున్నట్టు చెప్తారేమిటీ ఖబుర్లు అని కొద్దిగా కసిరాడు. మీకు ఏఇల్లు చూపించినా నచ్చదాయె అందుకే మీకు ఇల్లుదొరకటం లేదు.

ఆమధ్య మీరు చూసిన ఇల్లు వీళ్లు ఇద్దరే కనక సరి పోతుంది. చూపించి ఇది మీకు బాగుంటుందేమో, చూడండి అంటూ వో సలహా పడేశాడు. రాఘవ రావు ఆ సంభాషణపూర్వాలనుకోని, ఆయనికి నచ్చని ఇల్లు మాకెందుకండీ? పైగా మేము ఇంతకంటే మంచిఇల్లు అవుతే, తప్ప అసలు ఖాళీ చెయ్యమని తేల్చి చెప్పేశాడు.

అది రైటే అనుకోండి. అఇంటికి మార్కెట్టు పక్కనేవుంది. ఎక్కడికి వెళ్లాలన్నా ఐదు నయాపైసలు టికెట్టు. అన్ని బస్సులూ అక్కడే బయలుదేరటం మనవాళ్లు నలుగురూ కనపడతారు, అంటూ రెండో ఆయన చెప్పివప్పించేందుకు ప్రయత్నించాడు. అబ్బే, అటువంటి సౌకర్యాలతో అంతపని లేదు మాకు. మా ఆవిడకి అట్టే ఎక్కడికీ వెళ్లే అలవాటులేదు. కూర గాయలు ఇప్పుడు ఇంటికే వస్తున్నాయి. నాకు బస్సులదగ్గర కాచుకు నిల్చునే వోపికలేదు చెప్పద్దూ అంటూ రాఘవరావు అనేశాడు.

ప్లేట్లు మళ్లానింపుకుంటూ ఈవూళ్లో ఎవరూ ఇంటిని అంటుక్కూర్చోరమ్మా, సాయంకాలం అయ్యేసరికి ఆడవాళ్లు ఎంతో ముచ్చటగా బైటకి వెడతారు. మా ఇళ్లల్లో కూడా అంతా వెడతారు అంటూ నాగరికత లక్షణం బయట పెట్టాడు. మొదటిఆయన మన వాళ్లంటే ఈభాషకి అలవాటుపడ్డారు ఎక్కడికెళ్లినా నెగ్గుకురాగలరంటూ ఇంకోఆయన వాళ్లఘనత చెప్పాడు. అంతా వెళ్లేందుకు సిద్ధపడి వాళ్ల ఇళ్లు ఎక్కడ వున్నాయో చెప్పి, తెలుసుకోవటం ఏమీ కష్టంవుండదు ఆవీధిలో ఎవర్ని అడిగినా చెప్తారు. అని మళ్లా ఇంకోసారి ప్రతిభ బయట పెట్టుకున్నారు వాళ్లని పంపి, రాఘవరావు తలుపు వేసుకుని మధ్యాన్నం పట్టుకున్నారు, అంటూ పద్మతోచెప్పి నవ్వుకున్నాడు.

వాళ్లవరస నాకేం నచ్చలేదు. వోమూల ఇల్లు చూసి వుసూరుమంటూనే ఆ ఇల్లుచూడండి ఈ ఇల్లు చూడండి అని సలహా ఏమిటి? ఏదో చెత్తకొంప మనకి చూపించి ఈఇల్లు వాళ్లుపుచ్చుకోవాలని కాబోలు మీరుమాత్రం ఈ రకంవాళ్లని పిల్చుకరాకండి బాబూ అంటూ విసుక్కుంది పద్మ.

ఓసి పిచ్చిదానా వాళ్లు చెప్పినంతమాత్రాన మనం ఎల్లాగూ మారేది లేనప్పుడు బెంగఎందుకు? అప్పు డప్పుడు నలుగురితో కలుస్తూవుండాలి. మనుష్యులకి దూరంగా వుండేందుకు ప్రయత్నించకూడదు అంటూ పద్మకి బోధించాడు రాఘవరావు. మళ్లీ కొన్నాళ్లు నిశ్చింతగా కాలంజరిగింది. రాఘవరావు ఆఫీసుకు వెళ్లాక పద్మపనులు పూర్తిచేసుకు పడుకునే ప్రయ త్నంతో, వేసిన ఘడియలే మళ్లీ చూసుకునేందుకు ముందుగదిలోకి వెళ్లింది. కిటికీదగ్గర నాలుగుతలలు వకరికంటే వకరు ముందుకు వంచుతూ తొంగిచూడటం చూసి, ఎవరో అర్థం కాక తెల్లపోయి చూస్తూ వుండి పోయింది పద్మ. అందులో వెనకనిల్చున్న ఆవిడ కంఠము సవరించుకుంటూ రాఘవరావుగారు వున్నా రా? అని అడిగింది.

లేరంటూ పద్మ తల అడ్డంగా తిప్పివూరుకుంది. అందులో పళ్లు ఎత్తావిడ పెదిమముందుకి వెనక్కి జరుపుకుంటూ, తలుపుతియ్యండి అంటూ పద్మకి పురమాఇంచింది. తలుపు తెరవటమే తడువుగా అంతాలోపల సోఫాల్లో విశాలంగా జార్లపడుతూ కూలపడి, అబ్బా ఎంతవుక్కగా వుందండీ అంటూ జాకెట్లలోకి వూదుకుంటూ పైకి ఫేనుకోసం చూస్తు న్నారు. పద్మకి ఫేనుపెట్టాలని లేకపోయినా తను పెట్టక పోయినా వాళ్లే పెట్టుకునేట్టున్నారు అనుకుంటూ స్విచ్ వేసింది.

పళ్లు ఎత్తు ఆవిడ జరిగిన పమిటని పూర్తిగాతీసి మళ్లా వేసుకుంటూ, మనము ఎవరమో ఆవిడకి తెలిసి నట్టులేదు. మీరు చెపుతారా నన్ను చెప్పమంటారా? అని పెద్ద జరీ చీరకట్టుకున్న మెల్లకన్ను ఆవిడని అడిగింది. జరీఅంచు సవరించుకుంటూ ఈపాటికి ఆవిడ గ్రహించేవుండవొచ్చు. ఆ మధ్య మీవారు బల వంతంగా మావారిని వాళ్ల వాళ్లని తీసుకొచ్చారుట అంటూ మెల్లకన్నుని వయ్యారంగా తిప్పుతూ పెదిమలు తడుపుకుంటూ పద్మ కళ్లల్లోకి చూసింది. వచ్చే ఆవ లింతల్ని చిటికెలతో ఆపుతూ ఆ మధ్య ఎవరో రావటం వచ్చారు. అంత వివరంగా ఎవరు ఎవరో తెలుసుకో లేదు అన్న పద్మ సమాధానంవిని వచ్చినవాళ్లు వకర్ని వకరు చూసుకున్నారు.

అప్పటిదాకా మాట్లాడకండా నాజూగ్గా సోఫాకి అతుక్కు కూర్చున్న ఆవిడ ముందుకు వంగి చెంప ముంగురులు ఎక్కడ అతుక్కున్నాయో అని చేత్తో రేపుకుంటూ కొద్దిగా నవ్వు మొహంలోకి తెచ్చుకుని కులుకుతూ, ఆరోజు వచ్చిన ఆఫీసరుగారి భార్య ఆవిడే

అంటూ జరీచీర ఆవిడకేసి చూపించి మేము ఇక్కడికని రాలేదు, మాతో హిందీ చదివే అమ్మాయి ఈ పక్క వీధిలోవుందిలెండి ఆవిడ టీకి పిలిస్తే వచ్చాము. అక్కడదాకా వచ్చాముకదా మీ ఇల్లు చూసిపోదామని వచ్చాము అంటూ పూర్తిచేసి వూపిరి గట్టిగా తీసుకుంటూ మళ్ళా వెనక్కి చేరింది. జరీచీర ఆవిడ అంతకమునుపు కళ్లు తిప్పటం మూతి తిప్పటమే జరిగింది ఇహ తలకూడా వోలయగా వూపుతూ మీరు ఎప్పుడు ఖాళీచేసేదీ చెపితే మేము ఎల్లాగో సర్దుకువుండేందుకు ప్రయత్నిస్తాము అని పద్మకి చెప్పి, కొంగుజరీ నడుంచుట్టూ సరిచేసుకుంటోంది.

అబ్బే మేము ఎవరితోటీ ఖాళీచేస్తామని ఖాళీ చెయ్యాలనుకుంటుంన్నామనికానీ అనలేదే అని పద్మ చెప్పటం విని గుండ్రంగా పచ్చగావున్న ఆవిడ ఎర్ర జాకెట్టు పక్కన వంటి మెరుపు వారకంట చూసుకుంటూ, మీరన్నారని మేముమాత్రం అన్నామా? మిమ్మల్ని నలుగురులోకి తీసుకెళ్లాలని మా వుబలాటం, మా ఇంటి పక్కన మేడమీద రెండుగదులూ వరండా వుంది. చాలా బాగుంది మీ ఇద్దరే కనక హాయిగా వుండచ్చు. మావారు అప్పుడే ఇంటివాడితో మాట్లాడేశారుకూడాను అంటూ విశదంచేసింది. ఈసారి పద్మకి కోపం నిజంగానే వచ్చింది.

మీవారు పాపం ఎందుకు అంత శ్రమపడుతున్నారో మరి మాకైతే ఇల్లు అఖ్ఖర్లేదు. పోనీ వాళ్లని వుండమనరాదూ? అని జరీచీర ఆవిడని చూపించింది పద్మ. పరే వాళ్లకి చాలదు కనకనే మిమ్మల్ని అందులోకి మార్చటం అంటూ బైటపెట్టింది గుండ్రపాటి ఆవిడ.

ఆదేమన్న మాటండీ! వాళ్లకోసం వీళ్లకి చెప్పామా అంటూ కళ్లతో బెదిరించింది నాజూగ్గావున్నాననుకునే ఆవిడ. ఇంకెందుకూ వెడదాము పదండి అంటూ జరీచీర ఆవిడ విసురుగా లేచినిల్చుంది. పద్మ లోపలికెళ్లటంతో అందరికళ్లూ మూతులూ సైగలతో తిప్పుకుంటూ తీర్మానించుకోవటం పక్కగదిలోంచి చూసింది పద్మ. కాఫీ కప్పులు బల్లమీద పెట్టడంతోనే చెప్పకుండా తీసుకున్నారు అంతా. మళ్లీ ఏం మాట్లాడేందుకూ తోచనట్టు అటూఇటూ చూసి, పళ్లువెత్తు ఆవిడ ఆరంభించింది. ఈ పక్క వీధిలో వో తెనుగు కుటుంబం వుందికానీ ఆవిడతో అట్టే పెట్టుకోకండి నోరు మంచిదికాదు. అయినా నేను చెప్పివుండకూడదేమో అనుకుంటూ కొంగుతో మూతి తుడుచుకుని వెనక్కి జరిగి కూర్చుంది.

పాపం ఆవిడకి అట్టే ఎక్కడికీ వెళ్లటం అలవాటు లేదుటలే, వాళ్ల వారు చెప్పకు బాధపడ్డారుట అంటూ పెదిమలు తడుపుకుంటూ నాజూగ్గావున్న ఆవిడ పద్మ మీద సానుభూతి ప్రకటించింది. వాళ్ల గొడవ మనకెందుకు లెద్దురూ మనం వచ్చినపని కానేలేదు. మీరు ఎప్పుడూ ఇలాంటివే చెపుతారు అంటూ జరీచీర ఆవిడ గట్టిగానే కసిరింది మిగిలిన వాళ్లని.

బయలుదేరిన వాళ్లకి పనిమనిషి మెట్లదగ్గర ఎదురవటంతో వాళ్ల బాషా పాండిత్య ప్రదర్శన మొదలుపెట్టి దానికి ఏం చెప్పారో ఆ ఫలితంగా ఆ మర్నాడునించీ అది చేసే పని తగ్గించి టీ ఇంకా కలపలేదా అని అడగటం దగ్గరకి వచ్చింది. రాఘవరావు పద్మ బజారు సరుకులకని బయలుదేరటం, అదే మొదలు కావటంచేత అక్కడకొన్నీ ఇక్కడకొన్నీ కొనుక్కు ఇంటికి బయలుదేరుతూ అక్కడ వాళ్లనిగురించి మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ వెళ్లటం వెనకవచ్చే ఆవిడకి కూడా నవ్వువచ్చి ఎక్కడవుంటున్నారేమిటి మీరు అంటూ పద్మవీపుతట్టి అడిగింది. సామాన్లు టాక్సీలో పెడుతూ పద్మ సమాధానం ఇచ్చింది.

ఆవిడ తమ ఇల్లుకూడా ఆప్రాంతలోనే వుందని చెప్పి, ఎప్పుడయినా రమ్మని వెళ్లిపోయింది.

ఆ రోజు రాఘవరావు ఆఫీసుకి వెళ్లకమునుపే పద్మ, కడుపునెప్పి జ్వరంతో మూలుగుతోంది. రాఘవరావు తొందరగా వచ్చేస్తానని చెప్పి ఆఫీసుకి వెళ్లాడు, వెళ్లినదగ్గరనించీ పద్మకి వాంతులు పట్టుకున్నాయి. మనస్సు పరిపరి విధాల పోతోంది. చాలా నీరసంగా మూలుగుతూ సాయంత్రందాకా తను బతికి వుండనేమోనన్న అనుమానంతో పద్మకి ఏడుపు ఆగటంలేదు. వీధితలుపు చప్పుడు అవటం వినపడింది, నెమ్మదిగా వెళ్లి తలుపుతెరచి అక్కడే కింద కూలపడి నిస్సహాయంగా చూస్తోంది పద్మ. ఆ రోజు టాక్సీ స్టాండులో చూసిన ఆవిడ వెతుక్కుంటూ వచ్చింది. పద్మని పలకరించి, అయ్యో మేము ఇంత దగ్గరలో వున్నాంకదా? ఓ మాటచెప్పి పంపితే ఏం? అంటూ తలుపులేసి పద్మని తీసుకువెళ్లింది.

రాఘవరావు వచ్చేసరికి పద్మకి సపర్యలు చేస్తున్నావిడని చూసి ముందు గుర్తుపట్టలేదు, సమయానికి

దేవతలా వచ్చారు ఆవిడ అంటూ నీరసంగా మొదలు పెట్టింది వుపోద్ఘాతం పద్మ రాఘవరావుతో.

సరేలెండి ఇప్పుడుకాదు మీరు చెప్పాల్సింది అంటూ ఆవిడ మందలించి రాఘవరావుకి మందులు ఎప్పుడు ఇవ్వాలో చెప్పి అవసరమవుతే తన్ని పిలవమని చెప్పి వెళ్లిపోయింది.

పద్మ రెండురోజుల్లో తేరుకుంది. ఆవిడ రోజుకి రెండు మూడు సార్లు వచ్చి కనుక్కుంటూ కావల్సిన వన్నీ అమురుస్తూ చాలా సన్నిహితురాలయింది. పని మనిషికి కూడా నచ్చచెప్పి అన్నీ చేసేటట్టు చేసింది. పద్మ మనస్సులోనే ఎన్నోసార్లు కృతజ్ఞత తెల్పుకుంది.

రాఘవరావు మొదట వున్నంత చనువుగా ఆవిడతో వుండటంలేదు. పైగా వకటి రెండుసార్లు ఆవిడని విమర్శిస్తూ మాట్లాడ్డం పద్మకి కష్టం తోచింది. ఆవిడ ఇప్పుడు రావటం తగ్గించింది. వకరోజు రాఘవరావు మొదట్లో వచ్చినవాళ్లల్లో ఇద్దర్ని వెంటపెట్టుకువచ్చాడు.

పద్మని పిల్చి నువ్వు ఆవిడనుగురించి ఎంత మంచిగా చెపుతున్నావో, అంత చెడ్డదిట ఆవిడ అంటూ, లోపలికి వెళ్లాడు.

అబ్బే వట్టి చండాలంమనిషి అండీ. ధర్మరాజు లాంటి భర్త అయిన్నిపెట్టే తిప్పలు, ఇన్నీ అన్నీ కావనుకోండి. అత్తా మామా వున్నారు వాళ్లని గడప తొక్కనివ్వదు. అని ముక్కు పొడుంపీలుస్తూ చెప్పాడు బాల్డు తల ఆయన.

ప్రతి ఇంట్లో ఏదో గొడవలు వుంటూనేవుంటాయి. వాళ్ల సంసారం గొడవ మనకెందుకులెండి. మేము ఎవరో ఏమో తెలీకపోయినా నిజంగా సొంతవాళ్ల కంటే ఎక్కువగా చేసిందినాకు. ఆరోజు ఆవిడ రాక పోతే ఏమయ్యేదాన్నో అంటూ పద్మ చెప్పింది.

అదే ఇప్పుడు చెప్పేది మేము, చేస్తుంది ఏం లాభం? గొప్పకోసం మీ ఇద్దర్ని గురించీ ఇన్ని చెపుతోంది. వినలేక పోయాననుకోండీ అంటూ రెండో అతను వంతపాట మొదలుపెట్టాడు.

రాఘవరావు అక్కడికి రావటంతో రెండోఅతను కంఠము పెద్దదిచేసి చెప్పటం మొదలుపెట్టాడు. మీరు చాకిరీచేయించుకు కృతజ్ఞతకూడా చెప్పలేదుట. వక శేమిటి ఎందుకులెండి అవి అన్నీను అంటూ నసగటం మొదలుపెట్టాడు. నిజమే. మాది ఆవిషయంలో తప్పే మేము వెళ్లిచెప్పివుండాల్సింది అని పద్మ నొచ్చుకోవ టంతో ఇంక ఆ సంభాషణ పెరగలేదు.

కడుపునిండాక పద్మతోకూడా వెడతామనిచెప్పి మీరు ఇంతదూరంగా వుంటే ఇల్లాంటి ఇబ్బందులు వుంటూనేవుంటాయి. మా పేటలో వుంటే ఎవరో వకరు మీ ఇంటోనే వుండేవారు. ఇప్పుడైనా మించి పోయింది లేదనుకోండి. ఏదయినా ఖాళీఅవగానే వద్దురుగాని అన్నాడు మొదటి ఆయన.

పద్మ అప్రయత్నంగా అఫీసరుకి ఇల్లు దొరికిందా అని అడిగింది, ఆ ప్రశ్నకి ఇద్దరిదగ్గరనించి వెంటనే జవాబు రాలేదు. కొంతసేపు అయ్యాక తేరుకుని ఆవిడ చెప్పిందేమిటి? వాళ్లకోసం ఈ ఇల్లు మిమ్మల్ని మారమంటున్నామని అని ఇద్దరూ వక్కసారి పద్మని అడిగారు.

అబ్బే ఆవిడేం చెప్పలేదు పైగా మీరు వచ్చినట్టు నేను చెప్పలేదుగా? అంది పద్మ. రైటు ఆవిడదగ్గర అల్లాగేవుండాలి లేకపోతే బతకనివ్వదు. అసలు నా పేరు చెపితే ఈ చుట్టుపక్కలికి రాదు. ఈసారి చెప్పి చూడండి మీకే తెలుస్తుంది అని రెండో అతను పట్టు చేతులు ముందుకీ వెనక్కీ జరుపుకున్నాడు.

వాళ్లు వెళ్లాక పద్మకి ఏమిటి! వీళ్లు చెప్పింది నిజ మేనా! అన్న అనుమానం మొదలయింది. రాఘవ రావు నిశ్చింతగా ఈజీఛైరులో కూర్చుని పుస్తకం తిరగేస్తున్నాడు. పద్మ మాటలు మొదలుపెట్టింది. వీళ్లు చెప్పింది నిజముంటారా? ఏమో? అన్నట్టు పెదిమ విరిచాడు రాఘవరావు. మాట మారుస్తూ నా కోటు జేబులో వుత్తరాలు వున్నాయి పట్టుకురా అని చెప్పాడు.

పద్మ వుత్తరాలు చదువుతూ మళ్లా ఇంత తొందరలో బదిలీయా? అని ఆశ్చర్యంగా మొహం పెట్టింది. ఏం! నీకు ఇష్టంలేదా అని అడిగాడు రాఘవరావు. ఎవరికి చెప్పక ఇంటికోసం ప్రాణంతీస్తారు. ఆ వచ్చే అతనికి ఇస్తేనే మనకి అక్కడ ఇబ్బంది వుండదు అంటూ మళ్లీ పుస్తకం పేజీలు తిప్పుతున్నాడు. మర్నాడు రాఘవ రావు ఆఫీసుకు వెళ్లగానే పద్మ పని పూర్తిచేసుకు [illegible] ఆవిడ ఇంటికి వెళ్లింది. ఆవిడ చూసినా చూడనట్టు వూరుకోవడంచూసి పద్మ మనస్సు చిన్న పుచ్చుకున్నా, తనే పలకరించి మీరు చేసిన సాయం

ఎప్పుడూ మరవలేను అంటూ కృతజ్ఞత చెప్పి, వెడతానని బయలుదేరింది.

ఏదో వంటరిగా అవస్థపడుతూంటే చూడలేక వచ్చా తప్ప నాకేదో మీదగ్గరనించి వచ్చి వరుగుతుందని రాలేదు. అయినా తెనుగువాళ్లతో ఎప్పటి కప్పుడు పెట్టుకోకూడదనుకుంటూనే వుంటా నంటూ ఆవిడ స్వగతంగా చెప్పింది.

మీకు ఏదైనా మాలో లోపం కనపడితే క్షమించండి. మిమ్మల్నిగురించి మంచిగా అనుకున్నామేగాని పొరపాటుమాట ఏమి అనలేదే అని పద్మ చెప్పి వెడతానని బయలుదేరింది.

అనకపోవడం ఏమిటి లెండి? వాళ్లు మీఇంటి నించి తిన్నగా ఇక్కడికే వచ్చారు. మీవారికి ఇష్టం లేకపోయినా నేను రోజూ వచ్చేదాన్నని, మీ ఇంట్లో బాగున్న వస్తువులన్నీ కావాలన్నానని ఇంకా ఏవేవో చెప్పారనుకోండి అన్నీ చెప్పడం ఎందుకు అని వూరుకున్నా అంటూ ఆవిడ బైటపెట్టింది.

నేను అనుకుంటూనేవున్నా వాళ్లు ఇల్లా తంపులు పెట్టే రకమేనని వచ్చినప్పటినించీ మా ఇల్లు ఎవరికో ఇవ్వమనటం మమ్మల్ని ఇంకో ఇంటికి మారమని ఆడామొగా రకరకాలగా ఆపేక్ష వలకపొయ్యటం మాకు ఎక్కడో చుట్టరికం వుందంటూ అందరిదగ్గరా లేని వన్నీ చెప్పటం ఆ మాటకి వస్తే మిమ్మల్ని గురించి చెడ్డగా చెప్పింది వాళ్లేగా? ఎందుకులెండి గొడవ, మాకు మళ్లీ మేము ఇదివరకు వున్న వూరే బదిలీ అయింది అని చెప్పి పద్మ ఇంటికి బయలుదేరింది.

మేడమెట్లు ఎక్కుతూంటే పైన వరండాలో ఎవరివో మాటలు వినపడ్డాయి ఎవరొచ్చివుంటారా? అనుకుంటూ తొందరగా పైకి వెళ్లింది పద్మ. మొదట వచ్చిన ఆడవాళ్లు నలుగురూ నిల్చుని నవ్వుమొహంలోకి తెచ్చుకుంటూ మీకోసమే ఎదురు చూస్తున్నాము! ఎక్కడికెళ్లారు? అని పద్మని ప్రశ్నలు మొదలెట్టారు, సమాధానం చెప్పకుండానే తలుపులు తీసుకు లోపలి కెళ్ళింది.

వకళ్లమొహంలోకి వకళ్లు చూసుకుంటూ లోపలికి వచ్చి సోఫాలో కూర్చుంటూ అల్లా వున్నారేమి, వంట్లో బాగాలేదా? అని నాజూగ్గావున్నావిడ పద్మ నడిగింది. సమాధానంగా చిన్నగా నవ్వి వూరుకుంది. మెల్లకన్ను ఆవిడ పమిట జారుతూంటే కూడా గమనించుకోకుండా చేతులు తిప్పుతూ, ఈసారి మీ మాట నిలబెట్టుకోక పోయారంటే చూసుకోండి ఏం చేస్తానో, వంగ్యంగా అంటూ నాజూకుగా వున్నావిడకేసి వో కన్నుపెట్టి చిత్రంగా నవ్వింది.

మళ్లా వాళ్లు ఇంటికోసమే వచ్చారని అర్థమయ్యేందుకు ఆట్టేసేపు పట్టలేదు పద్మకి. ఇంకో ఆవిడ ఆ మాటని మరిపించేందుకు, ఏమిటండీ, మీరు పూర్తిగా పరిచయం కాకుండానే మళ్లా వెళ్లిపోతున్నారుట? ఆ మాట విన్నదగ్గరనించీ ఏమీ తోచటంలేదు చెప్పొద్దూ? అంటూ విచారం వెళ్లబెట్టింది.

మెల్లకన్నుఆవిడ పమిట అంచులు సరిచేసుకుంటూ, మధ్య మీకెందుకు విచారం? సర్వీసు అన్నాక ఎక్కడికి వేస్తే అక్కడికి వెళ్లాల్సిందే, ఎప్పుడు వెడుతున్నారు? అని పద్మనడిగింది. నాలుగురోజుల్లో వెడతామని ముభావంగా చెప్పింది పద్మ.

అయితే ఇల్లుమాత్రం ఎవరికీ మాట ఇవ్వకండీ మేమే తీసుకుంటాము. రేపు మంచిది కనక కొంత సామాను తెచ్చి పెట్టుకుంటాము. మీరు వోగది మాత్రం ఖాళీచెయ్యండి అంది.

అది మాత్రం వీలు పడదులెండి మా సామాన్లు సర్దుకునేందుకె చోటు చాలదు. అన్నీ ఇప్పిపెడితే, అయినా మీకు ఇస్తాడని నమ్మకమేమిటి? ఈ ఇంటాయన బంధువుఎవరో వస్తాట్ట అంటూ మెల్లిగా బయటపెట్టింది పద్మ.

అందుకేగా సామాను ముందుగా తెచ్చిపెట్టటం. ఇవ్వకేంచేస్తాడు? వాళ్లకి ఇంకోపది ఎక్కువ పారేశామంటే ఇంక మాట్లాడ్డు అంటూ అప్పుడే తనదయినట్టు గర్వంగా తల తిప్పుతూ సమాధానమిచ్చింది మెల్లకన్ను ఆవిడ.

మీకు సామాను సర్దటానికి తోడురమ్మంటే మేము వస్తాము అంటూ నాజూగ్గా వున్నావిడ, పద్మని ప్రసన్నం చేసుకునేందుకు అడిగింది. ఎవరూ అక్లర్లేదండి. మాట్లాడ్డం అయింది వాళ్లేసర్ది సామాన్లు ఎక్కిస్తారుట.

మీకు ఆ మధ్య సుస్తీచేసిందిటగా! మాకు ఎవరికీ తెలీనే తెలీదు. మీ పక్కవీధిలో వున్నావిడ వచ్చి చెప్పేదాకా అంటూ గుండ్రపాటిఆవిడ పద్మతో అంది.

చేసింది ఏమన్నా వూరుకుంటుందా? ఇంటింటికీ వచ్చి చెప్పేమాటలు వినలేకపోయాం బాబూ! ఆవిడ

చేస్తోందికదా అని మీరు అన్నీ మంచంలోనే జరప మన్నారుట కదూ? మీ వారేమో ఆవిడ వెంట కూడా కూడా రాసుకుతిరగటం, ఆవిడ కాఫీ ఇస్తోంటే చేతిని గట్టిగా నొక్కారని పైగా మా వారితోటి చెప్పటం. సిగ్గులేని మనిషి ఆయన వకటే నొచ్చుకున్నారు. చెప్పద్దూ అంటూ నాజూగ్గావున్నావిడ సానుభూతిగా మూతి పొడుగ్గా పెట్టుకుంది.

పక్కవీధి ఆవిడ అంతవిగ్రహం ఎప్పుడు వచ్చిందో కూడా తెలియలేదు ఏమిటీమళ్లాచెప్పుఅంటూ రెట్టిస్తూ లోపలికివచ్చే దూకుడు చూసి అందరూ తెల్లపోయి చూస్తూ వుండిపోయారు.

నేను చెప్పానని చెప్పాడా? పనికట్టుకు మీ ఆయన వచ్చి, వాళ్లఇంటికి ఎందుకు వెళ్లావు? ఆయన సంగతి తెలీనట్టువుంది నీకు, ఆడవాళ్లని చూస్తే వదలడంటూ వాగి, పైగా నేను అన్నానంటాడా? నేను అడక్కుండానే వాళ్ల పుట్టుపూర్వోత్తరాలు అన్నీ చెప్పింది ఎవరో? కనపడనీ అడుగుతా వదులుతాననుకోకు, నువ్వేదో అంటున్నావే, సిగ్గులేంది నువ్వా నేనా? అవసరాలు వుంటే గడపవదలకుండా తిరిగేది ఎవరో గుర్తుతెచ్చుకో అంది.

నువ్వు చేసందేమిటో మహా చెబుదూ, నీ నోటికి జడిసే మీ వీధికి రావాలంటేనే భయంపట్టుకుంది. నువ్వు చెప్పకపోతే ఎల్లా తెల్సిందేమిటి? వాళ్ల ఆయన చెయ్యిపట్టుకున్నట్టు అంటూ నాజూకు ఆవిడ వోకంట పద్మని చూస్తూ పక్కవీధి ఆవిడకి సమాధానంచెప్పింది.

మీ ఆయన చెప్పినమాటలు విన్నాక నిజమేనేమోనని జరిగినది చెప్పాను. మీలా అబద్ధాలు చెప్పను చస్తే తెలిసిందా? అంటూ ఆయాసాన్ని అణుచుకుంటూ పక్కవీధి ఆవిడపైస్థాయిలో సమాధానం ఇచ్చింది.

మెల్లకన్ను ఆవిడ కళ్లు తేలవేస్తూ వెనక్కి జార్లపడి వోండ్రింపు మొదలుపెట్టటంతో అంతా ఆవిడ చుట్టూ నిల్చుని ఫిట్టువచ్చిందంటూ వుపచారాలు మొదలుపెట్టారు.

ఇంటి యజమాని కొన్ని సంచులు డబ్బాలు బుట్టలూ తెచ్చి మధ్యగా పెట్టి అలమార్లు ఖాళీచేస్తే పెట్టుకుంటానని పద్మతో అనటం విని అంతా వక్కసారి వాళ్లసామాను సద్దుకోకండా మీవి అడ్డు పెట్టడం ఏమి బాగుంటుందని అటకాయించారు.

నేను రావుతో ముందే చెప్పాను పెట్టుకోమంటేనే తెచ్చాననంటూ వో అలమారు ఖాళీగావుంటే దాంట్లో అన్నీ సర్దుకుంటున్నాడు ఇంటిఅతను. అదేమిటండీ ఎవరైనా ఈవూళ్లో ఇంటివాడి చేతికి ఇల్లు అప్పగిస్తారా? మనవాళ్లకి ఇచ్చుకునే వాళ్లంగా? వాడు పగిడీ లేం దేమళ్లీ చచ్చినా ఇవ్వడు అంటూ సన్నపాటి ఆవిడ గట్టిగా కసిరింది పద్మని.

వాళ్లు ఎల్లాంటివాళ్లయినా మనంచేసేది చెయ్యాలి కానీ ఇల్లా తెలివితక్కువగా ఇంటివాడికి వదిలారు ఏమిటి? అని పక్కవీధి ఆవిడ పద్మని కొద్దిగా మందలించింది.

వాళ్లంతా వకటిఅవటం పద్మకి ఆశ్చర్యాన్ని కలిగించి బిత్తరపోయిచూస్తోంది. అసలు వాళ్లకి ఎందుకు ఇవ్వాలి ఇల్లు? అడగాలనుకుంది. రాఘవరావు రాకతో ఆ ప్రస్తావన ఆపి ఇంటి యజమాని సామాను తెచ్చుకున్నాడని చెప్పింది. మంచిపని చేశాడు. మనకిబాధ తీరింది. ఎవరికి ఇప్పించినా నిష్ఠూరమే అంటూ లోపలికి వెళ్ళాడు.

ఈ కొంపకోసం ఇన్నిసార్లు ఈ గడప తొక్కాల్సి వచ్చింది. చిన్నదశలోంచి పైకివస్తే ఇల్లాంటి బుద్ధులే వుంటాయి. మావారిలాంటి వాళ్ళు ఎక్కడో కానీ వుండరు. లేకపోతే కిందవాళ్ళతో ఇంతచనువుగా ఎవరుంటారు? అప్పుడే తెలివితెచ్చుకున్న ఆఫీసరుగారి మెల్లకన్ను భార్య నీరసంగా నిర్వచనం చేసింది.

ఏమండోయి, మీవారిపదవికి జడిసి మీతో రావటం లేదు. ఏదో సాటివాళ్ళు ఇంటికోసం అవస్థపడుతున్నారని తప్ప అంటూ గుండ్రపాటి ఆవిడ పౌరుషపడింది. వాళ్లు ఘర్షణపడుతూనే మెట్లుదిగుతున్నారు.

మీరు పక్కవీధి ఆవిడ చెయ్యి పట్టుకున్నారని చెప్పిందిట అని పద్మ రాఘవరావుకి చెప్పింది. హాతోస్మి ఆంజనేయదండకం చదువు అంటూ రాఘవరావు మెట్లదగ్గరకు వెళ్ళాడు. మెట్లపైన నిల్చున్న పక్కవీధి ఆవిడ రుసరుసలాడుతూ రాఘవరావుకేసి చూసి చరచరా దిగి వెళ్ళిపోయింది.

అంతా వకరకం పజ్జులాగే వున్నారు. కొంగుతో మొహం తుడుచుకుంటూ మాటల్లోన్నా కాస్త వుపకార బుద్ధివుంది, ఈ పక్కవీధి ఆవిడ వాళ్ళకంటే వెయ్యిరెట్లు నయం అనుకుంటూ అంది పద్మ.

స్త్రీ బుద్ధిః — తరవాత ఏమిటి? "రాఘవరావు నవ్వాడు.

మా నర్సింగ్ హోమ్‌లో బాలలదినోత్సవం

భారత ప్రధాని నెహ్రూ జన్మదినసందర్భాన నవంబరు 14 న ఆంధ్రమహిళాసభ నర్సింగ్ హోమ్ ఆవరణలో బాలల దినోత్సవం జరిగింది.

ఆనాటి ఉత్సవానికి మద్రాసు మెడికల్ సర్వీసెస్ డైరెక్టరు కుమారి డాక్టర్ మారికార్ అధ్యక్షత వహించారు. ఆర్థొపెడిక్ సెంటర్ సహాయ కార్యదర్శిని శ్రీమతి లక్ష్మీపార్వతి అధ్యక్షురాలికి స్వాగతం చెప్పారు.

బాలల దినోత్సవానికి విచ్చేసిన సభాసదులను, ఆంధ్రమహిళాసభ బృందాన్ని, ఆర్థొపెడిక్ సెంటర్‌లో చికిత్సపొందుతున్న బాల బాలికలని, నర్సింగ్ హోమ్ చుట్టు పట్లనుంచి వచ్చిన బాల బాలికలని వుద్దేశిస్తూ అధ్యక్షురాలు ప్రసంగించారు. భారతావనియందంతటా జరుపుకుంటున్న ఈ బాలలదినోత్సవ ప్రత్యేకతని గురించి పిల్లలకి అర్థమయేటట్లు విశదీకరించారు. బాలలో బాలుడై పోయి ఆనందించే మన ప్రధాని జన్మ దినోత్సవం బాలలదినోత్సవంగా జరుపుకోడం సముచితమైన విషయంగా ప్రస్తుతించారు. ఆంధ్రమహిళాసభ వివిధ రంగాల్లో మహిళా శిశు సంక్షేమం కొరకు చేస్తున్న కృషిని కొనియాడారు. ముఖ్యంగా ఆర్థొపెడిక్ సెంటర్‌లో చికిత్సపొందుతూ, ప్రత్యేక సదుపాయాలని పొందుతున్న యీ వికలాంగులైన బాల బాలికల ప్రగతి ప్రధాన మంత్రికి ప్రత్యేక సంతోష కారణమవుతుందని తెలియజేశారు.

ఈ సందర్భంలో ప్రధాన మంత్రి ఆయురారోగ్యాలతో అనేకజన్మదినాలూ, పిల్లలు బాలదినోత్సవాలూ యింత ఆనందంగానూ జరుపుకోవాలని కోరుకున్నారు. బాలల దినోత్సవ సందర్భాన వ్యాసరచనా, ఆటపాటలూ, లకీడిప్ మొదలైన పోటీలు జరిగినవి, వీటిల్లో గెల్చిన వారికి బహుమతులూ, పిల్లలందరికీ మిఠాయిలూ పంచి పెట్టారు డాక్టర్ మారికార్.

డాక్టర్ కమలాదేవి వందన సమర్పణతో, జాతీయ గీతంతో ఆనాటి బాలలదినోత్సవ సభ ముగిసింది.

మహారాష్ట్ర గవర్నర్ శ్రీమతి విజయలక్ష్మి

సాధారణంగా పదవుల వల్ల వ్యక్తికి గౌరవ ప్రతిష్టలు అబ్బుతాయి. కాని కొన్ని సందర్భాలలో వ్యక్తి వల్ల, పదవి గౌరవం యినుమడించటం జరుగుతుంది. అటువంటిదే మహారాష్ట్ర గవర్నర్‌గా విజయలక్ష్మి పండిట్ నియామకం. ఈ పదవివల్ల విజయలక్ష్మి పండిట్‌కి ప్రత్యేకత రాలేదుగాని ఆమె వల్ల యీ గవర్నర్ పదవికే ఒక విశిష్టత వచ్చింది.

శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ఇటు భారత రాజకీయాలకీ, అటు ప్రపంచ రాజకీయాలకీ చిరపరిచితురాలు. మూడుదశాబ్దాలుగా భారతరాజకీయాల్లో మునిగి తేలుతూ, జైళ్ళల్లో, మంత్రి పదవుల్లో, రాయబారి పదవుల్లో, అఖిలభారత మహిళాసభ అధ్యక్షపదవిలో, ఐక్యరాజ్యసమితి అధ్యక్ష పదవిలో యీమే భారతదేశానికీ వెనుకబడ్డ దేశాలకీ కూడా అనన్యమైన సేవచేసింది.

శ్రీమతి విజయలక్ష్మికి చాలా పదవుల్లో తొలి భారత మహిళగా, తొలి ప్రపంచ మహిళగా ప్రత్యేక గౌరవం లభించింది. ఈమె మంత్రి పదవిని మూడుసార్లు అలంకరించిన ప్రధమ భారతమహిళ. ఐక్యరాజ్య సమితికి అధ్యక్షత వహించిన ఏకైక మహిళ. ఈమె రష్యా, అమెరికా, బ్రిటన్ దేశాలకి భారత రాయబారిగ్గా వెళ్ళిన ఏకైక మహిళ. గవర్నర్ పదవిని అలంకరించిన భారత స్త్రీలలో యీమె మూడవ ఆమె. కీ. శే. సరోజినీదేవి, తరువాత ఆమె కుమార్తె పద్మజానాయుడు గవర్నరు పదవిలో వున్నారు. ఇప్పుడు విజయలక్ష్మిపండిట్ మూడవ మహిళా గవర్నరుగా నియమితులైనారు. అంతర్జాతీయ రాజకీయాల్లో, భారత రాజకీయాల్లో అనన్యమైన అనుభవాన్ని గడించి, అసంఖ్యాకములైన ప్రసంశలు బడసిన శ్రీమతి విజయలక్ష్మిపండిట్ మహారాష్ట్ర గవర్నరు పదవినలంకరించడంతో, ఆ గవర్నరు పదవికే అంతర్జాతీయ గౌరవం లభించింది. ఈ నూతన పదవీ స్వీకరణ సందర్భంలో ఆమెకి మా ఆంధ్ర మహిళాసభ సంస్థ తరఫున శుభాకాంక్షలు అందజేస్తున్నాము.

ఆంధ్రమహిళా ఉద్యమము

'సోమనాథ్'

ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని రంగాలలోను, శ్రీ వీరేశలింగము పంతులు అంకురార్పణము చేశాడని చెప్పాలి. ఆంధ్రమహిళా ఉద్యమానికిగూడా పంతులుగారే వైతాళికులైనారు. చంద్రమతి చరిత్రము; సతీహితబోధిని పంతులుగారు ప్రమదామణుల కోసరము వ్రాసిన రచనలయందు ముఖ్యమైనవి.

శ్రీ వీరేశలింగం పంతులుగారి ప్రభావమువలన శ్రీమతి కొటికలపూడి సీతమ్మగారి వంటి ఆదర్శమహిళలు బయలుదేరి అక్కడక్కడ మహిళా సంఘాలు స్థాపించారు. అలాంటి సమయంలోనే, శ్రీ రాయసం వెంకట శివుడుగారివంటి ప్రముఖులు "జనానా" పత్రికను స్థాపించి మహిళాభ్యుదయము కోసరము ఎంతైనా పాటుబడ్డారు. అంతేగాదు, ఆ సమయంలోనే, కాకినాడలో, విద్యాభి వర్ధనీ సమాజమూ; గుంటూర్లో స్త్రీ సనాతనధర్మమండలి; రాజమండ్రి ఏలూరులాంటి పట్టణాల్లో, మహిళా ప్రార్థనా సమాజాలు వెలిశాయి.

ఆనాటి ఆంధ్రమహిళా సమావేశాల స్థితిగతులు

ఆ రోజుల్లో మహిళాసభకు వెళ్లిన ఆవిడ తెగించిన ఆడవాళ్లలో జమ. అది మహిళా సమస్యలను గురించి చర్చించే సభ అయినా అలాంటి సమావేశాల కెంతో ఆక్షేపణలుండేవి. ఉదారుడైన భర్త ప్రోత్సాహములేని ఆడవాళ్ళు గడపదాటడానికే వీలుగాని రోజులవి!

దాదాపు యాభై సంవత్సరాలకు పూర్వము బాపట్లలో జరిగిన తొట్టతొలి ఆంధ్రమహాసభతో పాటు; మొట్ట మొదటి ఆంధ్రమహిళా సభ జరిగింది. కజిన్స్ సతీమణి; సరోజినీ నాయుడు; కమలాదేవి ఛటోపాధ్యాయ: విజయలక్ష్మీ పండిట్ వంటివాళ్లు, అఖిలభారత మహిళా సభను ఏర్పాటుజేశారు.

అఖిల భారత మహిళాసభ ఆ తర్వాత యావద్భారతములోను శాఖోపశాఖలుగా వ్యాపించి, రాష్ట్రీయ, మండల, తాలూకా, గ్రామస్థాయిలలో, యీ మహిళా సభలు జరగడముతో, మహిళా సభలమీదుండే ఆంక్షకాస్తా ఇట్టే తొలగిపోయింది.

ఆంధ్ర మహిళాసభను తీర్చిదిద్దిన వారియందు శ్రీమతులు ఆదుర్తి భాస్కరమ్మ, తుర్లపాటి రాజేశ్వరమ్మ, దామెర్ల కమలరత్నమ్మ, మనపాక కమలమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ, ఆచంట రుక్మిణమ్మగారలు ముఖ్యులు.

ఈ మహిళాసభలు ఒక్కో సంవత్సరం, ఒక్కొక్క జిల్లాయందు జరుగుతుండేవి. సెప్టెంబరునెల్లో తాలూకా సభలు; అక్టోబరులో మండల సభలు; నవంబరులో రాష్ట్ర సభలు; డిశంబరులో అఖిలభారత మహిళా సభలు జరిగేవి.

అఖిలభారత మహిళా సభ అంతర్జాతీయ మహిళా సభకు అనుబంధింపబడిన తర్వాత, అఖిలభారత మహిళా సభ ప్రతినిధిగా; అఖిలభారత మహిళాసభ స్థాయీ సంఘ సభ్యురాలు అయిన శ్రీమతి కొండా పార్వతీదేవి గారు ఖండాంతరాలకు వెళ్లివచ్చారు. శ్రీమతులు టి. చంద్రమతి; జాస్తి సీతామహాలక్ష్మమ్మ; కొండా పార్వతీదేవి ప్రభృతులు, ఆంధ్రమహిళసభ కార్యదర్శినులుగా ఉండి, అమోఘమైన కృషి జేశారు.

మహాత్ముని సహాయ నిరాకరణోద్యమం మహిళల పాత్ర

మహాత్మాగాంధీ యావద్భారతములో, దౌర్జన్య రహితమైన సహాయనిరాకరణోద్యమము ఆరంభించినపుడు, పురుషులతోబాటు మహిళలనుగూడా ఆహ్వానించినపుడు, స్త్రీలు అనేకులు ఆంధ్రయందు జరిగిన సమ్మెలు, సత్యాగ్రహములు, ప్రచారాలలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అలాంటివారియందు శ్రీమతులు ఉన్నవ లక్ష్మీబాయమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, దిగుమర్తి జానకీబాయమ్మ, సత్తిరాజు శ్యామలాంబ, కలగర పిచ్చమ్మ, పొణకా కనకమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, కొల్లా కనకవల్లి తాయారమ్మ, గోగినేని భారతీదేవిరంగా, ఆచంట రుక్మిణమ్మ, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మొదలైన వారు ముఖ్యులు.

ఇల్లా సహాయ నిరాకరణోద్యమము మూలంగా పట్టణాలలోనేగాక, పల్లె సీమలయందుండే మహిళలలో గూడా అఖండ ప్రబోధం కలిగింది. నూలు వడకడము, ఖద్దరు కట్టడం అధికమైపోయింది. ఆ తర్వాత ఉప్పు

సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో మన తెలుగు మహిళలు తమ ధర్మాన్ని నెరవేర్చుకున్నారు. కమ్యూనిస్టు ఉద్యమములో చేరిన డాక్టర్ కొమఱ్ఱాజు అచ్చమాంబవంటి విద్యాధిక సోదరీమణులుగూడా ప్రశంసనీయమైన కృషిజేశారు.

గాంధీ ఉద్యమమునందు గడిదేరిన శ్రీమతులు ఉన్నవ లక్ష్మీబాయమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, పొణకా కనకమ్మ, దుర్గాభాయి దేశ్‌ముఖ్, బత్తుల కామాక్షమ్మవంటివాళ్ళు మహిళా విద్యాసంస్థలను స్థాపించి జాతీయ విద్యాభివృద్ధికి దోహదం సమకూర్చిపెట్టారు.

కొల్లా కనకవల్లితాయారమ్మగారనే ఆవిడ హరిజన మహిళకుగాను ప్రత్యేకమైన విద్యాసంస్థను నెలకొల్పింది. కడప రామసుబ్బమ్మ, చుండూరి రత్నమ్మవంటివారు స్థానిక సంస్థలలోను; చోడగం అమ్మన్నరాజాగారు ఆనాటి సంయుక్త మదరాసు అసెంబ్లీలో డిప్యూటీ స్పీకరుగాను; ఆచంట రుక్మిణమ్మ ఆరోగ్యశాఖామంత్రిణిగాను; వావిలికొలను పద్మాసినీఅమ్మ సెనేట్ మెంబరుగాను; దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారు పార్లమెంటరీ సభ్యురాలు ప్లానింగుశాఖ సభ్యురాలుగూడా గావడం ఆంధ్ర మహిళా ఉద్యమ వికాసానికి ప్రత్యక్ష నిదర్శనం గదా!

మహిళల సారస్వతకృషి

శ్రీమతులు కాంచనపల్లి కనకమ్మ; గుడిపూడి ఇందుమతీదేవి; చిల్కపాటి సీతాంబ; స్థానాపతి రుక్మిణమ్మ, చేబ్రోలు సరస్వతి, గంటి కృష్ణవేణమ్మ ప్రభృతులు చక్కని కావ్యాలు వ్రాశారు. ఇంకా, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, నాయని కృష్ణకుమారి, మల్లాది వసుంధర, కొమ్మూరి పద్మావతి, ఆచంట శారద, కొప్పరపు సరోజనీదేవి, గుళ్ళపల్లి విశ్వేశ్వరమ్మ, భానుమతీ రామకృష్ణ; కె. రామలక్ష్మి ఆరుద్ర, మాలతీ చందూర్; ఇల్లిందల సరస్వతి, తెన్నేటి హేమలత (లత) శ్రీదేవి వంటివారు ముఖ్యులు,

ఆంధ్రమహిళ, గృహలక్ష్మి వంటి స్త్రీల పత్రికలు వెలిశాయి. ఈ పత్రికలు కొంతమంది నూతన రచయిత్రులు వెలయడానికి దోహదమిచ్చాయి. ఇవాళ ఆంధ్రప్రభ, ఆంధ్రవారపత్రికలు గూడా మహిళల కోసరము కొన్ని పేజీలను కేటాయించి, వారి పురోభివృద్ధికి తోడ్పడుచున్నాయి.

ఆంధ్రప్రభ వారపత్రికలోని ప్రమదావనము శ్రీమతి మాలతీ చందూర్‌గారి సారధ్యమున, చాలా జయప్రదముగా నిర్వహించబడుచున్నది. అలాగే ఒకప్పుడు ఆంధ్ర వారపత్రికలో, ఇల్లిందల సరస్వతివంటి వాళ్ళు బాగా కృషిజేశారు.

ఇక ఆంధ్రమహిళ, గృహలక్ష్మి వంటి పత్రికలు మొదటినుంచి మహిళాజన సంక్షేమము కోసరమే తమ జీవితాన్ని అంకితము జేసుకున్నాయి.

ఇవికాక లోగడ ప్రచురితములైన సావిత్రి, హిందూసుందరి, ఆంధ్రలక్ష్మి, అనసూయవంటి పత్రికలు కూడా పేర్కొనదగినవి.

ఆకాశవాణిలో వనితావాణి కార్యక్రమముల ద్వారా అనేకమంది వనితలు వెలుగులోకి రావడము ఎంతైనా ముదావహమైన విషయము!

ఆధునిక వనితలు

ఇవాళ మానసికముగా అభివృద్ధి జెందని ఆంగ్ల విద్యాధురీణులైన మన యువతీ యువకులు అస్థిర సంకల్పాలతో నిలకడలేని నిర్ణయాలతో, అర్థరహిత మైన ఆదర్శాలతో, జీవితములో, నైరాశ్యాన్ని పొంది చిట్టచివరకు జీవితాలమీదనే విసుగెత్తిపోయి బరువు బరువుగా బ్రతుకుతున్నారు. చాలామందికి కాలేజీ వాతావరణము అర్థరహితమైన రోమాంటిక్ డ్రామాలగా అయిపోయింది.

చదవడమనేది ఇవాళ మానసిక వికాసము కోసరము కాదు. మగవాళ్ల కట్నాలకోసరము, గొప్ప గొప్ప ఉద్యోగాలకోసరము అయితే, ఆడపిల్లలు పెండ్లి రాయబారాలు స్థిరమైనదాకా, లేక ఉద్యోగముచేయడానికి, మీద వివరించిన రెండేరెండు ధ్యేయాలు.

ఈనాడు మనదేశము పారిశ్రామికంగా వ్యావసాయికంగా చాలా పరిణామం చెందుతోంది.

యువతీ యువకుల మనోభావాలు కొత్తరూపందాల్చి, కొత్త రుచుల్ని వాంఛిస్తున్నాయి.

పాతభావాలు, పాతఅభిరుచులు క్రమక్రమంగా మూలబడుతున్నాయి. కాని మన సమాజము, ముఖ్యముగా (ఆడా,మగ) విభేద దృష్టియందు చాలా వెనుకబడి ఉందనే చెప్పాలి.

మగాడు ఆడమనిషి, ఒంటరిగా చేరి మాట్లాడుకున్నా రంటే, నవ్వుకున్నారంటె, అప్యాయంగా ఒకరిజీవితపు గాథలు మరొకరిముందు వెళ్ళబోసుకుని సానుభూతి ప్రదర్శిస్తూ అనునయ వాక్యాలు చెప్పుకున్నారంటే లోకము కాస్తా కాకిగోల పెడుతోంది.

తెరమరుగున, నాలుగుగోడలమధ్య రాత్రింబగళ్ళు గడపకుండా, కొంచెము గాలీవెలుతురులోకి, ఒకసంపన్న కుటుంబీకురాలు అయిన మహిళ వచ్చినిలుచున్నదంటే "ఏమి నడమంతరమమ్మా"అని మూతి ముక్కు విరుస్తుంది కాలానికి కళ్ళెంవేయాలని జూచే, ఆ మురికి గుంపు.

ఇవాళ వివిధ రంగాల్లో మన మహిళలు ప్రాతినిధ్యము వహిస్తున్నారు. మంచిదే! కాని మన వైవాహిక విధానాలు మారాలి. యువతీ యువకుల "వివాహము" అనేది వారి ఆర్థిక పరిస్థితులమీదగాక, వారి ప్రేమకే యెక్కువ ప్రాముఖ్యమిచ్చేదిగా ఉండాలి.

పల్లెసీమల్లోని యువతులుగూడా కేవలము వేషములోకాక మానసికముగాగూడా నిజమైన అభివృద్ధి చెందాలంటాను.

అర్థరహితమైన ఆలోచనలతో, సోమరితనముతో కాలాన్ని ఆరోగ్యాన్ని పాడుజేసుకోవడంగాదు మానవ జాతి లక్ష్యం!

నియమబద్ధమైన జీవితం గడుపుతూ, పరిమిత కుటుంబములతో; ఆడంబరాలులేని జీవితము సాగించాలి. తోటి యువతుల్ని సంస్కరించి క్రాంతిపథము వేపు నడిపించే కార్యక్రమమునందు ఆంధ్రమహిళ తన కర్తవ్యాన్ని నిర్వహించాల్సుంటుంది.

నేడు మన భారతదేశములోనూ, మన తెనుగు గడ్డ మీదనూ, గ్రామసీమలయందూ వివిధరంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఆరంభమైనాయి. కాని ఇది యింకా సక్రమపథాన నడవడము లేదనిపిస్తోంది.

సంఘ సేవిక(లు)గా, కాలేజీ వాతావరణమునుంచి, ప్లాకునందు పాదముబెట్టి లలనామణులు, సినీస్టార్స్ లాగా, వేనిటీబ్యాగ్ పుచ్చుకుని, కార్లమీద బ్లాక్ ప్రెసిడెంట్లు, బీ. డీ. వోల సరసను విహారముజేస్తుంటే మన పల్లెలవేపు మహిళామణులు క్రాంతిపథంలో ముందుకు రాగలరా?

గ్రామాల్లో ఈవిడ వెళ్ళిన తొలి రోజుల్లో మాత్రము నలుగురూ మూగుతారు. ఆ తర్వాత యీవిడ రాకపోకలను గురించిగూడా గ్రామీణులు ఎవరూ పట్టించుకోరు.

అందుచేత, యీనాటి గ్రామాభ్యుదయ కార్యక్రమమునందు విద్యా వివేకవతులైన మహిళల ప్రాముఖ్యత ఎంతైనా ఉంది.

పల్లెల యందుండే పాఠశాలల్లో పంతుళ్ళకంటే పంతులమ్మలు ఉంటే మంచిది. కాని హయ్యరుగ్రేడు ట్రెయినింగు పొందిన ఉపాధ్యాయినులు గ్రాదు ఇక్కడుండాల్సింది. కనీసము స్కూలుఫైనలు పరీక్షయందైనా ఉత్తీర్ణులై సెకండరీట్రెయినింగు పొందినవారు పంతులమ్మలుగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేయాల్సుంటుంది.

పాఠశాలల నిర్వహణ కోసరము పల్లెలకొచ్చిన పంతుళ్ళు, పంతులమ్మలు అవ్యక్తులు గాకుండా పిల్లల్ని ఆధునిక విద్యా విధానమునందు తీర్చి దిద్ది, తమ ఉత్తమ ఆదర్శాలు గ్రామస్థులయందు ప్రతిబింబింప చేయగలిగే వారుగా ఉండాలి. దండన విధానమునందుగాక వారి ఇచ్ఛానుసారముగా, వినోదాత్మకముగా వాళ్లకి ఆత్మీయులుగా కనబడుతూ ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాల్సుంటుంది. అలాంటి కృషియందు పురుషులకంటే స్త్రీలు ఎక్కువ నేర్పరులని నా విశ్వాసం!

గ్రామీణ యువతులను వంటా వార్పులాంటి విషయాల్లోనేగాక, మనసుకి వికాసము కలిగించే పుస్తకాలు చదివేలాగ చేయాలి. మనసుకువికాసము కలిగించని చెత్త పుస్తకాలు చదివి ఏమీ లాభంలేదు.

ఇలా మన ఆంధ్రమహిళలు వివిధ రంగాల్లో అభివృద్ధిచెందడమేగాక, మన గ్రామీణస్థాయినిగూడా పెంపొందింప చేయాల్సుంది.

ఈవిషయమునందు విద్యావతులైన ఆంధ్రయువతీ మణుల బాధ్యత ఎంతైనాఉంది.

కాబట్టి ఆంధ్రమహిళలు, మన ఆంధ్రప్రదేశ్ మహిళామణులందరి అభ్యుదయము కోసరము పాటుబడి ఆంధ్ర జాతికే కీర్తి తేగలరని ఆశిస్తున్నాను.



మెట్రిక్
కొలతలలో మాత్రమే
క్రయ విక్రయాలు జరపండి

1962 అక్టోబరు 1వ తేదీ నుండి దేశమంతటా మెట్రిక్ కొలతలను విధిగా ప్రవేశపెట్టడముతో క్రయ, విక్రయాలు ఇప్పుడు మీటర్ల లెక్కనే జరుగుతాయి.

మనము నిత్యమూ వాడుకొనే కొన్ని దుస్తుల నిర్ణీతమైన కొలతలు ఈ క్రింద నీయబడినవి. కొత్త యూనిట్లతో పరిచయం ఎక్కువైన కొలదీ, గజాల లెక్కలో ఆలోచించడం క్రమంగా మానివేయగలుగుతారు.



చొక్కా	: 2 మీటర్ల 75 సెంటీమీటర్లు (లేక 2.75 మీటర్లు)	-3 గజాలకు బదులుగా
కోటు	: 2.75 మీటర్లు	ఒక్కొక్కదానికి 3 గజాలకు బదులుగా
పంట్లాము	: 2.75 మీటర్లు	
రవిక	: 0.90 మీటరు	- 1 గజానికి బదులుగా

6 గజాల చీర 5½ మీటర్ల పొడవు వుంటుంది

1 మీటరు = 1 గజముపైన 3⅜ అంగుళాలు
1 గజం బట్ట ధర రూ. 1.00 న.పై అయితే అదేరకం 1మీటరు బట్ట ధర రూ. 1.09 న.పై అవుతుంది.

మెట్రిక్
పద్ధతి అనగా
సౌలభ్యము, మరియు సారూప్యము

భారత ప్రభుత్వముచే జారీ చేయబడినది.

DA 62/132

సీరియల్

ధన్యజీవి

శ్రీమతి శారదా నాగరాజ్

1

వ్యాపారంకోసమని బొంబాయిలో మూడునెలలు గడిపి తిరిగి గృహోన్ముఖుడవుతున్న మధు హృదయం ఆనందంతో చిందులు త్రొక్కుతోంది

ఫస్టుక్లాస్ టికెట్టు కొనుక్కొని కూలితో సహా ప్లాటుఫారం మీదకు వచ్చేడు. ట్రెయిన్ లైన్‌మీదనే వుంది. బయలుదేరడానికి పదినిముషాలు మాత్రమే వ్యవధి వుంది. సామాను కంపార్టుమెంటులో పెట్టిన కూలీకి డబ్బులిచ్చి పంపేసి తనూ ఎక్కి కూర్చున్నాడు. కూర్చున్న రెండునిముషాలకల్లా మెయిల్ బయలు దేరింది.

మధు ఆలోచనలు యింటివైపు మళ్లేయి. మూడు నెలల దీర్ఘవియోగానంతరం తిరిగి తన ప్రేయసిని చూడబోతున్నాడు. కంటికిరెప్పలా కాపాడే తండ్రి, తోడు నీడగా వుంటున్న తమ్ముడు, అనుక్షణం తన రాకకోసమని వెయ్యికళ్లతో ఎదురుచూస్తూండే ప్రేయసి వనజ అంతకన్న అతనికి ఆప్తులెవరూ లేరు. కాని వీరు చాలరూ ?

తిరిగి వచ్చిన వెంటనే ముహూర్తం నిశ్చయించి వివాహానికి కావల్సిన ఏర్పాట్లు చేయదల్చుకున్నట్లు తను బొంబాయికి బయలుదేరేముందే తండ్రిచెప్పేడు. ఎంతగా పెద్దలు యీ వివాహానికి యిష్టపడినా, పెళ్లికి ముందుగా యిద్దరూకలిసి మెలిసి తిరగడానికి వారెవరూ యిష్టపడ లేదు.

అందువల్ల తనూ వనజా తరచు వూరివెలుపలనున్న అమ్మవారి కోవెలలో రహస్యంగా కలుసుకుంటుండేవారు. యిక వివాహమయిపోతే యీ రహస్యప్రణయ సమావేశాలఅవసరం కూడా వుండదు. యీ వూహవొచ్చేసరికి అతని శరీరం పులకరించింది

తీయని వూహాలతో జేబులోంచి సిగరెట్టొకటి తీసి వెలిగించి, వూహాలోకంలో తేలియాడుతున్నాడు మధు.

2

బి. కాం. పాసయిన మధు వుద్యోగంలో చేరకుండా తండ్రి అడుగుజాడల్లో నడవదలచి వ్యాపారంలో చేరేడు. పొరుగున కాపురముంటున్న వెంకట్రామయ్యగారి ఏకైక పుత్రిక వనజ.

వనజ, మధు చిన్నప్పట్నుంచీ ప్రాణస్నేహితులు. యౌవన ప్రాంగణంలో అడుగుపెట్టిన వనజ బహిరంగంగా మధుతో మాట్లాడటానికి సిగ్గుపడినా అమ్మవారి కోవెలలో రహస్యంగా మధు హృదయం మీద తల వాల్చి తీయని కబుర్లతో అతనిని మైమరపింప జెయ్యడానికి ఏమాత్రం వెనుకాడేది కాదు.

కాని వెంకట్రామయ్యగారికి మొదట్నుంచీకూడా మధుకి పిల్లనివ్వడానికేమంత యిష్టంలేదు గాని హఠాత్తుగా ఒకనాడు మధు బొంబాయినుంచి తిరిగిరాగానే వనజనిచ్చి చేస్తానని మాటయిచ్చేశాడు.

ఆ కబురు వినే మధు నిండుహృదయంతో బొంబాయి బయలుదేరి వెళ్లేడు. యీనాడు పొంగి పరవళ్లు త్రొక్కుతోన్న హృదయంతో ఆనంద తరంగాలతో వుక్కిరిబిక్కిరవుతూ యింటికి బయలుదేరాడు.

దారి మధ్యలో ఏ స్టేషన్‌లు వచ్చాయో, కంపార్టుమెంటులో ఎందరు ఎక్కి దిగి పోయారో యివన్నీ గమనించేస్థితిలోలేడు మధు. నిర్ణీత కాలానంతరం రైలు గమ్యస్థానాన్ని చేరుకుంది.

3

సెంట్రల్ స్టేషన్‌లో మెయిల్ ఆగింది.

గబగబా కూలీనిపిలిచి సామానుదింపించాడు. తను వస్తున్నట్టు టెలిగ్రాంద్వారా తెలియజేసినా తమ్ముడు స్టేషన్‌కి రానందుకు అతనిమనస్సు కొద్దిగా బాధపడింది. కాని చేసేదేమీలేక గేటుదగ్గరకు బయలు దేరేడు. టిక్కెట్టు కలెక్టరుకి టిక్కెట్టు చూపించి, స్టేషన్ బయటికివచ్చేసరికి రిక్షావాలాలు, టాక్సీవాలాలు అందరూ అతన్ని చుట్టుముట్టేరు.

అందర్నీ వొదుల్చుకుని చివరకి ఒకటాక్సీ ఎక్కి సామాను అందులో పెట్టించి, కూలివాడికి డబ్బులిచ్చి టాక్సీఎక్కి కూర్చున్నాడు. స్టేషన్‌నుంచి తాముండే గ్రామం చేరేసరికి అరగంటయినా పట్టుంది. ఆ రాబోయే అరగంటే అరవై యుగాలుగా అతనికి తోచింది.

స్టేషన్‌కి రాకపోయినా యింట్లోనయినా తండ్రి తమ్ముడు ఎంతో ఆనందంతో ఎదురుచూస్తూండి వుంటారు. వనజ డాబానుంచీ, వీధికిటికీలోంచీ

తనొచ్చాడా, లేదా అని వెయ్యి కళ్లతో వేచియుంటుంది. ఊహాలోకంలో తేలియాడుతున్న మధుకి మద్రాసు మహా నగర వీధులగుండా వెళ్తున్న టాక్సీయొక్క వేగంగాని, దారిలోని సుందరదృశ్యాలుగాని, తమవైపుకు త్రిప్పుకో లేకపోయేయి.

ఉన్నట్టుండి టాక్సీ ఆగేసరికి ఊహల్లోంచి ఉలిక్కిపడి తేరుకున్నాడు మధు. వాళ్లయింటిముందే టాక్సీ ఆగింది. గేట్‌కీపర్ గేటు తెరిచాడు, ఉత్సాహంతో కిందికి దిగేడు. టాక్సీవాడు సామాన్లు లోపలపెట్టి డబ్బుకోసం చెయ్యిజాచాడు. పర్సులోంచి పదిరూపాయలనోటు తీసి అతని చేతిలో వుంచాడు మధు. అతను చిల్లర యివ్వబోగా అతనికి తన ఆనందంతో పాలు పంచి యివ్వాలని గాబోలు చిల్లరతీసుకుందుకు తిరస్కరించాడు. టాక్సీవాలా ఆనందంలో మెరిసే కళ్లతో కృతజ్ఞతా సూచకంగా చేతులు జోడించి వెనుదిరిగేడు

హాలుమధ్య వాలుకుర్చీలో కూర్చొని పేపరు చూసు కుంటున్న తండ్రి విశ్వనాథంగారు చప్పుడు విని తల యెత్తి చూశారు. మధుని చూడగానే ఒక్కక్షణం నిశ్చేష్టుడై అంతలోనే తేరుకుని,

"ఏరా? ఎప్పుడురావడం? ఉత్తరం ముక్కయినా లేకుండా ఊడిపడ్డావేమిటి?" అంటూ సంతోషంతో పరామర్శించాడు.

మధు చిరునవ్వుతో సోఫాలోకూర్చుని బూట్లు విప్పు కుంటూ,

"ఉత్తరం వ్రాయక పోవడమేమిటి? టెలిగ్రాం యిచ్చానుగా? అందలేదా?" అన్నాడు.

మధు టెలిగ్రాంయిచ్చిన సంగతి ఆయనికి తెలీదు. బహుశః చిన్నకొడుకు తీసుకుని పని తొందరలో మర్చిపోయాడేమో! అనుకున్నారు. ఏమయితేనేం? క్షేమంగా యిల్లుచేరావు. అదే పదివేలు అంటూసంతృప్తి వెలిబుచ్చేరు. లేచి స్నానం అదీ కానియ్యి! తర్వాత అన్నీ మాట్లాడుకుందాం అన్నారు ఆయన.

4

విశ్వనాథంగారికి మధు పెద్ద కొడుకు. చిన్నవాడు కుమార్. ఎమ్. బి. ప్యాసయి యిప్పుడే ప్రాక్టీసు ప్రారంభించాడు. మధు చామనచాయగా గంభీరం వుట్టిపడ్తూ ఆరడుగుల పొడవున ఒకపిల్ల జమీందారు లాగా హోదాగావుంటాడు.

కుమార్ మంచి పసినిమ్మపండు ఛాయలో మిగతా అంతా అన్నగారిలాగే వుంటాడు. కుమార్ మూడేళ్ల పసి వాడుగా వున్నపుడే విశ్వనాథంగారికి భార్యావియోగం కలిగింది. కాని పిల్లలపోషణలో లోపం కలుగుతుందేమో నన్న భయంతో ఆయన మళ్లీ పెళ్లి చేసుకోలేదు.

కొడుకులిద్దరి మీద ఆయనకి వెర్రిమమకారం. వారిద్దరూ ఆయనకి రెండు కళ్లతో సమానం. తను కనిపిస్తే చాలు ఎన్నో సంగతులు ఆదరంతో మాట్లాడ్తూండే ఆయన యీరోజు ముభావంగా వున్నట్లు కనిపించింది. కారణం అతనికి అర్థం కాలేదు.

ఆలోచిస్తూలేచి డ్రస్ తీసేసి స్నానం చేశాడు. అప్పన్న అప్పటికే అతని గదిని శుభ్రంచేసి కాఫీ గ్లాసూ టిఫిన్‌ప్లేటూ తెచ్చిగదిలో బల్లమీద వుంచాడు.

కుమార్ ఎక్కడికెళ్లాడో ఏదైనా అర్జంటు కేసుండి వెళ్లిపోయాడా? టెలిగ్రాంయిస్తే నాన్నకి తెలీకపోవడమేమిటి? అతనికెందుకో అన్నీ ఆశ్చర్యంగా వున్నాయి. మనస్సంతా కలతగా వుంది. ఎంతో ఆనందోత్సాహాలతో ఆయింట్లో అడుగు పెట్టాడు. తమ్ముడు కనిపించక పోవడం, తండ్రి ముభావం అతని ఉత్సాహాన్ని చప్పగా చల్లార్చివేశాయి.

టిఫిన్ తినబుద్ధి కాలేదు. కాఫీగ్లాసు చేతిలోకి తీసు కుంటుండగా,

"అన్నయ్యా!" అంటూ కుమార్ గదిలో అడుగు పెట్టాడు.

తమ్ముడ్ని చూడగానే తిరిగి అతనిలో కదలిక కలిగింది. అతను పలకరించే లోపుగానే కుమారే ప్రారంభించాడు.

"నువ్విచ్చిన టెలిగ్రాం అందిందన్నయ్యా! కాని స్టేషన్‌కి వద్దామనుకునే సరికి అర్జంటు కేసొకటి అడ్డొచ్చింది. నాన్నగారికిచెప్పివెళ్దాం అనుకుంటూనే ఆ హడావుడిలో మరిచేపోయాను. సరేగాని బొంబాయి విశేషాలేమిటి?" అంటూ ఎన్నోసంగతులు మాట్లాడడం ప్రారంభించాడు.

మధు కాఫీతాగుతూ అన్నీవింటూ కూర్చున్నాడుగాని, అతని మనస్సు అన్యాక్రాంతమైవుంది.

ఇన్నివిషయాలు మాట్లాడుతున్నాడు గాని వనజ విషయం చెప్పడే? అనుకున్నాడు. అంత స్పష్టంగా, ముఖాముఖిన ఆమెను గురించి అడగడానికి సిగ్గేసింది.

మధు పరధ్యానం చూసి కుమార్ తన వాక్ప్రవాహానికి ఆనకట్ట కట్టేడు. కాని అతని పరధ్యానానికి కారణం ఆ మాత్రం వూహించ లేకపోలేదు.

మధు వుండ బట్టలేకపోయాడు. మనసులోని ఉద్వేశాన్ని అణుచుకుంటూ తాఫీగా తమ్ముడడిగిన వాటికి జవాబులు చెప్పేడు.

చివరికి "వెంకట్రామయ్యగారు కులాసాగావున్నారా? నేను బొంబే వెళ్లేముందు ఆయనకి వొంట్లో బాగలేదని అనుకున్నారు కదా! వాళ్లింట్లో అందరూ కులాసాయేనా?" అని యధాలాపంగా అడిగినట్టు అడిగేడు.

వెంకట్రామయ్య గారి పేరెత్తే సరికి కుమార్ మొహం నల్లబడిపోయింది. అన్నగారి ప్రశ్నకి ఏమని జవాబివ్వాలో అతనికి తోచలేదు.

వనజను మధు ఎంత గాఢంగా ప్రేమిస్తున్నాడో అతనికి తెలియనిది కాదు. వనజను గురించి నిజంగా జరిగినదంతా చెప్తే అతను ఎంతబాధ పడ్తాడో, తర్వాత పరిణామాలు ఎలావుంటాయో? యీ ఆలోచనలతో కుమార్ ఏమీ జవాబివ్వకుండా ఎటో చూస్తూ కూర్చున్నాడు.

తమ్ముని మౌనం, మధుకి భరింపరానిదయింది. యింతసేపూ వసపోసినపిట్టలాగా వాగుతూ కూర్చున్న కుమార్ వెంకట్రామయ్యగారి కుటుంబం పేరెత్తేసరికి మౌనం ధరించాడు. ఏం జరిగివుంటుంది, కొంపదీసి వనజ కేమైనా ఆపద సంభవించలేదుకదా! వనజ ఆపద అనుకునేసరికి అతని నవనాడులూ క్రుంగిపోయాయి. కాఫీకప్పు బల్లమీదపెట్టి కుమార్ వేపు నడిచాడు. కుమార్ రెండుభుజాలు పట్టుకుని కుదుపుతూ, "ఏమిట్రా! మాట్లాడవేమిటి? ఏమయింది? వనజ నెమ్మదిగావుందా?" అంటూ ఉద్వేగంతో ప్రశ్నలవర్షం కురిపించాడు.

ఆ కుదుపుకి కుమార్‌లో కదలిక కలిగింది. అన్నగారి రెండుచేతుల్నీ పట్టుకుని "ఏం చెప్పమంటావన్నయ్యా? వనజ..."

"ఆ! వనజ? ఏమయింది? నావనజకేం ఆపదొచ్చింది కుమార్?" ఆతృతగా అడిగేడు మధు.

"వనజ మనందరినీ వదిలి వెళ్లిపోయిందన్నయ్యా" గబగబా యీమాటలుచెప్పేసి హృదయంలోని భారాన్ని తగ్గించుకున్నాడు కుమార్. కుమార్ ఆవాక్యాన్ని పూర్తి చేయకముందే

మధు "ఆ" అంటూ కుమార్‌చేతులోని తనచేతులను వదుల్చుకుంటూ క్రిందికి జారిపోయాడు.

ఆ పడడంలో ప్రక్కనున్న టేబుల్ మీదవున్న గాజుకూజాకి చెయ్యితగిలి అతని తలమీద పడింది. అతనిహృదయం వ్రక్కలైనట్టే అదికూజా ముక్కచెక్కలైంది. అంతా లిప్తలోజరిగిపోయింది. యీసంఘటనచూసి కుమార్ స్తంభించిపోయాడు. క్షణంలో తేరుకుని, "అన్నయ్యా!" అంటూ గావుకేకపెట్టూ అతని మీదికి వొరిగేడు. అతనికేకకి హాలులోని తండ్రి, యింట్లోని పనివాళ్లు అందరూ ఒక్క అంగలో వొచ్చిపడ్డారు.

నేలపైన తలమీదగాయంతో పడివున్న మధుని చూడగానే అందరికీ గుండెలు ఝల్లుమన్నాయి. ఎలాగైనా అందరిలోకి కాస్త గుండెధైర్యంగలవాడు కుమార్ ఒక్కడే!

డ్రైవర్‌ని కారుసిద్ధం చెయ్యమన్నాడు. గాజు పెంకులమధ్య స్పృహలేకుండా పడివున్న మధును సాయం పట్టి అందరూ కారులో జేర్చారు.

కారు శరవేగంతో హాస్పిటలు చేరుకుంది. కుమార్ సహాధ్యాయుడొక్కడు అక్కడే వుద్యోగంలో వుండడంవలన మధుకి ఆలస్యంలేకుండా చికిత్సజరిగింది. డాక్టరు ఏమీ ప్రమాదంలేదని ధైర్యం చెప్పిందాకా తండ్రీ కొడుకులకి మనస్సు నెమ్మదిగాలేదు.

5

వెంకట్రామయ్యగారు విశ్వనాధంగారితో ఎంత స్నేహంగా వుంటున్నా మధుకి వనజనివ్వడం ఆయనకి యిష్టం వుండేదికాదు. తనవేలువిడిచిన బావమరిదికి క్షలగ్గూపాయల ఆస్తి వుండడమే అందుకు కారణం. ఆ ఆస్తిముందు ఆ బావమరిది నలభై సంవత్సరాల వయస్సూకూడా ఏమంత ఎక్కువగా కన్పించలేదు ఆయనకి. అసమాన సౌందర్యరాశి వనజముందు ఆ పెళ్లికొడుకు దివిటీముందు దీపంలాగా వుంటాడు. అదీఏమో ఆటంకంగా తోచలేదు వాళ్లకి. కాని మధు బొంబాయి వెళ్లేముందు ఒకనాడు భార్యతో మధుకి వనజ నివ్వడానికే నిశ్చయించానని చెప్తూండగా ప్రక్కగదిలోంచి వింటున్న వనజ ఆనందానికి హద్దులు లేకపోయాయి.

ఆయన ఎందు కోసమని అంతలో తన నిర్ణయాన్ని మార్చుకున్నాడో ఆమెకి అర్థంకాలేదు.

కాని చీకటి పడినతరువాత మామూలుగా మధును కలుసుకునే సంకేతస్థలానికి నిండు హృదయంతో పయనమైంది. దారిలోనే ఎదురుపడిన మధుతో ఆమె తనతండ్రి అన్న మాటలను చెప్తూంటే ఆమె కపోలాలు సిగ్గుతో ఎరుపెక్కేయి. కళ్లల్లో ఆనంద భాష్పాలు నిల్చేయి.

వనజ మాటలువిన్న మధు హృదయంకూడా సంతోషంతో నిండిపోయింది. అందువల్లనే వ్యాపారం కోసం బొంబాయి వెళ్లాల్సివచ్చినందుకుకూడా అతనేమంత బాధపడలేదు. తిరిగి రాగానే ఎలాగూ వనజ పూర్తిగా తనదై పోతుంది. ఆ నమ్మకంతోనే, ధైర్యంతోనే రెండు రోజుల్లో బొంబాయి బయలుదేరి వెళ్లిపోయాడు.

6

వెంకట్రామయ్యగారి వుద్దేశం వేరు. మధు బొంబాయి వెళ్లేవిషయం ముందుగానే పసికట్టాడు. మధుని ప్రస్తుతం అవూరినుంచి పంపేస్తే మిగతా విషయాలు మళ్లీ ఆలోచించుకోవచ్చునని భార్యతో ఆనాడలా చెప్పేడు.

మధు బొంబాయివెళ్లిపోగానే అసలు విషయం బయటపెట్టేడు. వారంరోజుల్లో ముహూర్తం స్థిరపరిచాడు. యీ విషయం తెలిసి విశ్వనాధంగారు నిలువునా నీరైపోయారు. కుమార్ సరేసరి. అన్నగారికీ సంగతి తెలిస్తే ఏమైపోతాడోనని చాలా భయపడ్డాడు, కాని ఎవరూ కూడా మధుకి యీ విషయం తెలుపడానికి సాహసించలేక పోయారు.

వరుసకు మేనమామయిన ఒకవ్యక్తితో తన వివాహం నిశ్చయమైందని తల్లిద్వారా తెలుసుకున్న వనజ కుప్పలా కూలిపోయింది. హృదయం బ్రద్దలయేలాగ తల్లివొడిలో తలవాల్చి ఏడ్చింది. ఏంలాభం? ఆమెకూడా నిస్సహాయురాలే! చండశాసనుడైన భర్తకు ఎదురాడే గుండెధైర్యం ఆమెకిలేదు.

మధుకి తన వివాహవిషయం ఉత్తరం ద్వారాతెలుపడానికికూడా వనజకి అవకాశం దొరకలేదు. ఆమెని వెయ్యికళ్లతో కనిపెట్టడానికి గట్టిఏర్పాట్లు చేసి వుంచాడు తండ్రి.

అకస్మాత్తుగా తన అదృష్టం తారు మారైనందుకు ఆమె కంటికి మంటికీ ఏకధారగా విలపించింది. తనకు తెలిసిన దేవతలందర్నీ మనసారా వేడుకొంది. ఆసమయంలో ఏదేవతకీ ఆమె వేడుకోలు వినేంత సాహసం లేకపోయింది. బహుశః వెంకట్రామయ్యగారికి భయపడి వుంటారు.

తన గదికిటికీలోనే కూర్చుని శూన్యం లోకి చూస్తూ పని పూర్తయిపోతే ముహూర్తంలోపల మధు రాకపోతాడా అని ఆశతో, వెయ్యికళ్లతో ఎదురుచూశేది. ఆమె ఆశలు ఫలించేట్టులేవు. దేవాలయంలో పరస్పరం చేసుకున్న ప్రేమ బాసలన్నీ వృధా అయేట్టున్నాయి. కన్నతల్లిదండ్రులకే ఆ సుకుమార హృదయంలోంచి వినవచ్చే కన్నీటి ఘోష విన్పించలేదు. డబ్బుకీ, జీవితానికీ ముడిపెట్టున్నారు. మనసు లేని మనువు చేస్తునికు ఆమె ఏం బావుకోవాలని?

రాత్రింబగళ్లు ఎంత ఆలోచించినా ఆమెకి గత్యంతరం కన్పించలేదు ఒక్కటితప్ప! అదే మృత్యువు. మృత్యువుతోడైతేనే యీ యినుప సంకెళ్ల బారినుండి సులభంగా తప్పించుకోవచ్చు, కాని అందుకూ అవకాశంలేదు కదా!

(ఇంకా ఉంది)

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the Month of October 1962

OUT-PATIENT DEPARTMENT:—

No. of Surgical cases treated	47
" " Medical " "	777
" " Ante-natal " "	216
" " Post-natal " "	88
" " E.E.N.T. " "	38
" " Gyneac " "	68
" " Dental " "	7
Total " " New Patients treated	1,241
" " " Old " "	1,617
Grand Total	2,852

ADMISSION REGISTER:—

No. of Patients admitted for Normal Delivery	133
" " " " Abnormal Delivery (Face-2; Ert. Breech-1; Forceps-6)	9
" " Ante-natal with False pains Treated	16
" " Ante-natal with Toxeamia	7
" " Medical casese Treated	38
" " Post-Natal " "	5
" " Gyneac Cases Treated	27
" " Surgical Cases Treated	6
" " Babies admitted as Lodgers	148
Grand Total	389

(True Copy)

Sd. Dr. K. R. AMBUJA
Resident Medical Officer

(Sd.) Dr. M. PAVANA BAI
Medical Superintendent

(Sd.) B TIMMABAI
Joint Secretary

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము	: హిందీ, కాశీవిశ్వవిద్యాలయపుఅడ్మిషన్, ఆంధ్రామెట్రిక్, ఇ. ఎస్. ఎల్. సి., పరీక్షలకు శిక్షణ.
పారిశ్రామిక విద్యాలయము	: కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు. ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ, బీద విద్యార్థినులకు ఉచితము.
మహిళా మందిరము	: విద్యార్థినులకు వసతి గృహము.
ఆంధ్ర మహిళ	: స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక
నర్సింగ్ హోమ్	: స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల, కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాల—అడయారులో నిర్మించబడినవి. భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్ ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది. ఫామిలీ ప్లానింగు వర్కర్సుకు శిక్షణ కూడ యివ్వబడుచున్నది.
ఆర్థోపీడిక్ సెంటర్	: వికలాంగులగు బాలబాలికలకు సంరక్షణ, విద్య యిచ్చే సంక్షేమకేంద్రం.
ముద్రణాలయము	: విద్యార్థినులకు అచ్చుకూర్పు. బైండింగ్. ప్రూఫురీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును. ప్రింటింగు జాబ్ వర్క్సు చేయబడును.
నాగేశ్వర శిశువిహార్	: పిల్లల విద్యావినోద కేంద్రం ప్రాథమిక పాఠశాల నడుపబడుచున్నది.
వనితా బాలవిహార్	. స్త్రీలకు, పిల్లలకు, పార్కు, ఆటస్థలం

ఆంధ్ర మహిళా సభ, హైదరాబాదు

హైదరాబాదు శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు : (1) రీజనల్ "హేండిక్రాఫ్టు్స, (2) సంక్షిప్త విద్యాప్రణాళిక, (3) చేనేత శిక్షణ- ఉత్పత్తి కేంద్రము, (4) పౌర సంక్షేమ కార్యక్రమ పథకము, (5) వసతిగృహము.

Printed and Published by N. R. Chendur at Andhra Mahila Press, 7-A. Rosary Church Rcad,